
దిక్సూచి
DIKSUCHI

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-3

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 162 బి) 136 సి) 145 డి) 174

సమాధానం: (ఎ)

వివరణ : ప్రతి డయాగ్రమ్ పై అంకెల లబ్ధం, కింది అంకెల లబ్ధాలను కూడితే వృత్తం మధ్యలోని సంఖ్య వస్తుంది.

8x4x2=64 7x1x6=42 9x4x2=72


3x6x5=90 8x2x5=80 6x5x3=90



64+90=154 42+80=122 72+90=162

కాబట్టి సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 229 బి) 349 సి) 254 డి) 529


సమాధానం: (ఎ)

వివరణ : పైన వృత్తంలో అంకెలను ఒక సమూహంగా, వృత్తానికి కింద గల అంకెను ఒక సమూహంగా రాసుకొని తీసివేసిన వృత్తంలో సంఖ్య వస్తుంది.

426-351=75, 756-543=213

కాబట్టి 574-345=229

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 32 బి) 48 సి) 56 డి) 71

సమాధానం: (సి)


వివరణ : చతురస్రానికి నాలుగు వైపుల గల అంకెల లబ్ధాన్ని 10తో భాగిస్తే చతురస్రంలోని సంఖ్య వస్తుంది.

$$5\times4\times2\times3=\frac{120}{10}=12$$

$$8\times3\times5\times6=\frac{720}{10}=72$$

కావున $7\times4\times10\times2=\frac{560}{10}=56$ సమాధానము అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 51 బి) 84 సి) 60 డి) 96

సమాధానం: (ఎ)

వివరణ : వృత్తానికి నాలుగు వైపుల గల విడివిడి అంకెల వర్గాలను కూడితే వృత్తంలోని సంఖ్య వస్తుంది.

62+32+102+92=226

82+62+72+22=153

52+12+42+32=51

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

L_{12}	N_{34}	M_{16}
M_{24}	L_{30}	N_{33}
N_{6}	M_{8}	?

ఎ) L7 బి) N6 సి) M4 డి) L6

సమాధానం : (ఎ)

వివరణ : ప్రతి వరుసలో నిలువుగా అడ్డంగా ఔ, ఖ ప్రతి వరుసలోను వస్తున్నాయి. కాబట్టి 3వ వరుస చివర ఔ రావాలి. ప్రతి వరుసలో నిలువుగా గల మొదటి రెండు సంఖ్యల మొత్తం.

12+14=36 **36 అనేది 62**


34+30=64 **64 అనేది 82**

అదే విధంగా

16+33=49 49 అనేది 72

కావున సమాధానం ఔ7

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 55 బి) 46 సి) 62 డి) 58

సమాధానం: (ఎ)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో

52 + 72 = 25 + 49 = 74 - 32 = 42

రెండో డయాగ్రామ్‌లో

62 + 42 = 36 + 16 = 52 - 25 = 27


కాబట్టి మూడో డయాగ్రామ్‌లో

92 + 32 = 81 + 9 = 90 - 35 = 55 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



గగన్‌యాన్

అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపి, వారిని క్షేమంగా తిరిగి భూమికి తీసుకువచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తొలి సారి చేపట్టబోతున్న ప్రయోగమే 'గగన్‌యాన్'

భారత అంతరిక్షరంగ పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, భవిష్యత్తులో 2035 నాటికి అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు, 2040 నాటికి మానవ సహిత చంద్రమండల యాత్రకు సంసిద్ధమయ్యేందుకు గగన్‌యాన్‌ను ఒక నాంది ప్రస్థానంగా చెప్పుకోవచ్చు. 2006లో పునాది పడిన ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రమారమి పదివేల కోట్లు.

వివిధ దశల్లో భద్రత పరీక్షలు

2025లో చేపట్టనున్న ఈ ప్రయోగానికి ముందు భద్రతపరంగా మరో రెండు డమ్మీ ప్రయోగాలను ఇస్రో చేపట్టనుంది. 2024 జూలైలో జీ1(గగన్ యాన్-1) ద్వారా 'వ్యోమమిత్ర' అనే రోబోను కలిగి ఉన్న తొలి గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను, 2024 డిసెంబర్‌లో జీ2(గగన్ యాన్-2) అనే రెండో గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను పంపనున్నారు. 2025లో జీ3 అనే మూడో దానితో ఈ డమ్మీ ప్రయోగాలు ముగుస్తాయి. ఇవేకాక మరో 20 రకాలైన భద్రతా ప్రయోగాలూ ఇస్రో చేపట్టనుంది. చివరిగా వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ ప్రయోగాన్ని 2025 చివరినాటికి చేపట్టనున్నారు.

గత అక్టోబరులో టెస్ట్ వెహికల్ డెమాన్‌స్ట్రేషన్-1(టీవీ-డీ1) (లేదా) టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 అని పిలిచే ప్రయోగాన్ని చేపట్టి 'క్రూ ఎస్కేప్ సిస్టమ్' పనితీరును ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్‌ను రాకెట్ నుంచి వేరుచేసి, సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే ప్రక్రియే 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'. దీనికి అత్యంత వేగంగా ప్రతిస్పందించే 'క్విక్ రియాక్టింగ్ పాలిడ్ మోర్టార్'లను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి చాలా వేగంగా ప్రజ్వరిల్లి అధిక థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా ప్రమాద సమయాల్లో క్రూ మాడ్యూల్ తక్షణం రాకెట్ నుంచి వేగంగా విడివడి భూమి వైపు ప్రయాణించడానికి వీలవుతుంది. ఈ క్రమంలో వివిధ దశల్లో శక్తివంతమైన పారాచూట్‌లు విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా బంగాళాఖాతంలో జారవిడుస్తాయి.

అనంతరం ఇండియన్ నేవీ ఈ క్రూమాడ్యూల్‌ను వెలికితీస్తుంది. ఈ టీవీ-డీ1 ప్రయోగం ద్వారా వ్యోమగాములు లేని డమ్మీ క్రూ మాడ్యూల్‌ను వినియోగించి ఈ ప్రక్రియను విజయవంతంగా పరీక్షిస్తారు.

అదేవిధంగా వ్యోమగాముల భద్రతను దృష్టిలో ఉంచుకొని గగన్‌యాన్-1 డమ్మీ ప్రయోగంలో భాగంగా తొలుత వ్యోమగాముల స్థానంలో 'వ్యోమమిత్ర' అనే హ్యూమనాయిడ్ రోబోను క్రూ మాడ్యూల్‌లో ఉంచి అంతరిక్షంలోకి పంపనున్నారు. తద్వారా ఈ రోబో, మైక్రో గ్రావిటీ ఎక్స్‌పెరిమెంట్స్, మాడ్యూల్ పారామీటర్స్‌ను పరీక్షించి వ్యోమగాములు ఏదైనా అసౌకర్యానికి, ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటే గుర్తిస్తుంది.

గగన్‌యాన్-ప్రయోజనాలు

- గగన్‌యాన్ విజయవంతమైతే వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం సాధించిన అమెరికా, రష్యా చైనా సరసన భారత్ కూడా సగర్వంగా చేరుతుంది.
- గగన్‌యాన్ ప్రయోగ విజయం తదుపరి భారతదేశ మానవసహిత అంతరిక్ష ప్రయోగాలపరంగా, ఖగోళ అన్వేషణపరంగా చేపట్టబోయే అనేక ప్రాజెక్టుకు ఊతమవుతుంది.
- అంతర్జాతీయంగా భారతదేశ సాఫ్ట్‌పవర్ ఇనుమడించి, అంతర్జాతీయ దౌత్య, వ్యూహాత్మక సంబంధాలను బలపరుస్తుంది.
- శాస్త్ర, సాంకేతిక రంగాలపైకి విద్యార్థుల ఆసక్తిని మళ్లించడానికి ఉపకరిస్తుంది. తద్వారా భావితరాల వైజ్ఞానిక నైపుణ్యాలు మరింత మెరుగవుతాయి. నవకల్పనలకు దారితీస్తుంది.
- అనేక రంగాల సమన్వయంతో, సహకారంతో జరుగుతున్న ఈ ప్రయోగం వల్ల భారీ స్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- దేశీయంగా రూపొందించిన వాహకనౌక, సాంకేతికతలు గల ఈ ప్రయోగం దేశ ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సామర్థ్యాలను చాటిచెబుతుంది.

వివిధ సంస్థల సహకారం

ఈ ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలోకి పంపేందుకు నలుగురు వ్యోమగాముల ను ఎంపిక చేశారు. వీరు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉన్నారు. భారతదేశంలో వ్యోమగాముల శిక్షణ సౌకర్యాలకు సంబంధించిన సాంకేతిక వ్యవస్థల కొరత కారణంగా ఇస్రో, రష్యా స్పేస్ ఏజెన్సీ 'రాస్ కోస్ మాస్' అనుబంధ సంస్థ 'గ్లావ్ కోస్ మాస్'తో ఒప్పందం చేసుకొని ఫిబ్రవరి 2020 - మార్చి 2021 మధ్యకాలంలో ఈ నలుగురు వ్యోమగాములకు అంతరిక్ష పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన తర్ఫీదును ఇప్పించారు.

అంతేకాక ఈ గగన్‌యాన్ మిషన్‌లో అనేక భారతీయ సంస్థలు కూడా సాంకేతిక, పరిశోధన, అభివృద్ధిపరంగా విస్తృత సేవలు అందిస్తున్నాయి. అవి- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవీ, భారత వాతావరణ సంస్థ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, సిఎస్ఐఆర్ ల్యాబ్, అనేక విద్య పారిశ్రామిక సంస్థలు.

●



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ప్రయోగం-దశలు

'జీఎస్ఎల్‌వీ ఎంకె-3(ఎల్‌వీఎం-3)' లాంచ్ వెహికల్ ద్వారా ఆర్బిట్ మాడ్యూల్‌ను శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగిస్తారు. ఇది భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లోఎర్త్ ఆర్బిట్(దిగువ భూకక్ష్య)లోకి ఆర్బిట్ మాడ్యూల్‌ను 16 నిమిషాల్లో ప్రవేశపెడుతుంది. ఈ కక్ష్యలో వ్యోమగాములతో కూడిన, భూమిని పోలిన వాతావరణం ఉంటే క్రూ మాడ్యూల్, క్రూ మాడ్యూల్‌కు సాంకేతిక సహకారం అందించే సర్వీస్ మాడ్యూల్‌ల కలయిక అయిన ఆర్బిట్ మాడ్యూల్ మూడు నుంచి ఏడు రోజులపాటు(పరిస్థితులను బట్టి) ఉంటుంది. తదుపరి దిశ మార్చుకొని, భూమిపైకి తిరిగి రావడానికి సమాయత్తం అవుతుంది. భూమికి తిరిగి రావడానికి కావాల్సిన త్వరణం కోసం డీబూస్ట్ ప్రక్రియ ప్రారంభమై సర్వీస్ మాడ్యూల్ నుంచి క్రూ మాడ్యూల్ వేరుపడుతుంది. తదుపరి పారాచూట్స్ విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను భూమి వైపుగా తరలించి గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో పడుతుంది. క్రూ మాడ్యూల్ నుంచి వ్యోమగాములను రికవరీ ఆపరేషన్ ద్వారా నేవిదళం సురక్షితంగా వెలికితీయడంతో గగన్‌యాన్ ప్రయోగం సంపూర్ణమవుతుంది. డీబూస్ట్ తరవాత 36 నిమిషాల వ్యవధిలో క్రూ మాడ్యూల్ సముద్రంలో పడటం జరుగుతుంది.

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



శ్రీకాళహస్తి మార్చి 3: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. 14 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు క్షేత్ర సంప్రదాయం ప్రకారం పరమశివుడి భక్తుడైన కన్నప్పకే తొలి పూజ చేశారు. ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ వేదోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని తెలంగాణ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ వెంకటరమణ

నరసరావుపేటలో వలంటీర్లకు నగదు పంపిణీ

ఒక్కొక్కరికీ కవర్‌లో రూ.5 వేలు

- ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్.. రాత్రికిచ్చినవాటిపై మాత్రం మాయం
- పెదకూరపాడు, వినుకొండల్లో యథేచ్ఛగా చీరెలు, కుక్కర్ల పంపిణీ
- పల్నాడులో వైసీపీ ఎమ్మెల్యేల ప్రలోభపర్వం
- ఈసీ పట్టించుకోవడం లేదని విపక్షాల ఆగ్రహం

నరసరావుపేట, మార్చి 3: పల్నాడు జిల్లాలో బహిరంగంగానే ఎన్నికల తాయిలాల పంపిణీకి వైసీపీ ఎమ్మెల్యేలు బరితెగించారు. కొద్దిరోజుల కిందట పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఓటర్లకు చీరెలు, కుక్కర్లు మొదలైనవి పంపిణీ చేశారు. ఇప్పుడు నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు. నరసరావుపేటలో ఆదివారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఒక్కో వలంటీరుకు రూ.5 వేల నగదు కవర్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్ ఉండగా, రాత్రికి ఇచ్చిన కవర్లపై స్టాంప్ లేదని వారు చెబుతున్నారు. ఈ భేటీలో ఎన్నికల్లో వైసీపీ కోసం ఎలా పని చేయాలో ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని.. అందుచేత వైసీపీని మళ్లీ గద్దెనెక్కించేందుకు వారు కృషి చేయాలని, అలాగే సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారులను ప్రభావితం చేసేలా పనిచేయాలని ఆయన సూచించినట్లు పలువురు వలంటీర్లు తెలిపారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఉండవంటూ ఓటర్లకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వార్డుల్లోని నేతలతో టచ్‌లో ఉండాలని ఆదేశించారని అంటున్నారు. బాహాటంగానే ప్రలోభాల పర్వం కొనసాగిస్తున్నా ఎన్నికల సంఘం (ఈసీ) పట్టించుకోవడంలేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



రాత్రి పంపిణీ చేసిన నగదు కవర్‌పై స్టాంప్ లేని వైనం

రూ.300 దర్శన క్యూలైన్ వద్ద స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం భక్తులు ప్రవేశించే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్‌కు సమీపంలోని ఓ గదిలో ఆదివారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. క్యూలైన్‌కు సమీపంలో విద్యుత్, ఇతర వస్తువులను భద్రపరిచే గది నుంచి ఆదివారం మధ్యాహ్నం పొగలు రావడాన్ని దగ్గర్లో ఉన్న భద్రతా సిబ్బంది గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఫైర్ ఇంజన్‌తో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. లోపలున్న వస్తువులను వెలుపలకు తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ట్రోఫీతో ఏపీ హైకోర్టు క్రికెట్ జట్టు సభ్యులు

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్‌లో విజేతగా ఏపీ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108 పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవ స్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేటి నుంచి 'పది' హాల్ టికెట్లు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు సోమవారం నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పేరు, పుట్టిన తేదీ వివరాలు ఇచ్చి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునే వీలుందన్నారు. అలాగే పాఠశాల కోడ్, పాస్‌వర్డ్‌తో ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థుల హాల్ టిక్కెట్లు పొందవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఇస్రో చైర్మన్‌కు పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం

విజయవాడ (మొగల్రాజపురం), మార్చి 3 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ప్రతిష్ఠాత్మక పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం అందిస్తున్నట్టు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1989 నుంచి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, కళారంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను గౌరవిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులకు పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు ఈ పురస్కారం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కాగా, పిన్నమనేని పురస్కార ప్రదానోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 6వ తేదీన జరుగుతుందని ప్రకటించారు.

ఉక్కు పరిరక్షణకు మహా పాదయాత్ర

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్షల శిబిరం నుంచి ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, గాజువాక, ఆటోనగర్, షీలానగర్, కాకానినగర్, ఎన్ఏడీ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన పీఏసీ కమిటీ సభ్యుడు కోన తాతారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు కేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రకు సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు ఎం.శ్రీభరత్ సంఘీభావం ప్రకటించారు.



మహా పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు, కార్మికులు


ముక్కంటి ఆలయంపై ఎగిరిన డ్రోన్

- శనివారం అర్ధరాత్రి వీడియోల చిత్రీకరణ
- పోలీసుల అదుపులో ఐదుగురు తమిళనాడు యువకులు

శ్రీకాళహస్తి, మార్చి 3: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంపై ఓ డ్రోన్ కెమెరాతో తమిళనాడుకు చెందిన ఐదుగురు యువకులు వీడియోలను చిత్రీకరించారు. వీరిని ఆలయ సెక్యూరిటీ గుర్తించి పోలీసులకు అప్పగించారు. చెన్నైకి చెందిన విఘ్నేష్, అజిత్ కన్నన్, శంకర్ శర్మ, అరవింద్, పోర్చే జీఎస్ తిరుమల శ్రీవారిని దర్శించుకునిశనివారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ముక్కంటి ఆలయానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు అతిథి గృహంలో గది అద్దెకు తీసుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరంభం కావడంతో ఆలయ పరిసరాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. వీటిన్నింటినీ చిత్రీకరించాలని ఆ యువకులు భావించారు. తాముంటున్న అతిథి గృహం భవనం పైనుంచి డ్రోన్ కెమెరాతో అర్ధరాత్రి ప్రధాన ఆలయంలో చిత్రీకరించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆలయ అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత డ్రోన్‌ను వెంబడించి యువకులను గుర్తించారు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

పాత పెన్షన్ విధానాన్ని తెచ్చే పార్టీకే ఓటు: యూటీఫ్

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), మార్చి 3: ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు హామీ ఇస్తుందో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకే తమ ఓటు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ తెలిపారు. విజయవాడలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరణను మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.



కుళాయి.. కష్టం

- ఇంటింటికీ రక్షిత నీరు కరువు
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో సాగని పనులు

నత్తనడకన జల్‌జీవన్

నిధుల లేమి.. పనులు నత్తనడకతో జల్‌జీవన్ మిషన్ జాప్యం జరుగుతోంది. కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రతిఒక్కరికీ అందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కష్టంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేయడంలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ పనులు చాలాదగ్గర్ల ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోజులు.. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రతిఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్ర స్థాయిలో అది అమలు కాలేదు. 2019లో ఈ పథకాన్ని అమలుల్లోకి తీసుకొచ్చినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ పథకం ఉమ్మడి గుంటూరు జిల్లాలో నత్తనడకన సాగుతుంది. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే లక్ష్యాల మేర పనులు జరుగుతున్న పరిస్థితులు కానరాడంలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. దీంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం కష్టంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టే విధంగా 2019లో ప్రణాళికను రూపొందించారు. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. జల్‌జీవన్ మిషన్‌లో ఇప్పటికే ఉన్న పథకాలను విస్తరించడం, పునరుద్ధరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. అయితే వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,30,653 గృహాలకు ఇప్పటి వరకు 4,47,735 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.44 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,82,918 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఇలానే పనులు సాగితే నిర్ధీత కాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితి అనుమానమే.



పెదతురకపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ దుస్థితి

చిట్టచివరన పల్నాడు జిల్లా

రక్షిత నీటి సరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో 33.03 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. గ్రామాలలో 4,32,148 గృహాలు ఉండగా పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన తర్వాత 84,570 కుళాయిలను ఇచ్చారు. 2,89,412 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. జల్‌జీవన్ మి షన్ అమలులో పల్నాడు జిల్లా చిట్టచివరన ఉంది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులుగుర్తించి రూ.508.16 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. చేపట్టి న పనుల్లో 209 పనులు మాత్రమే పూర్త య్యాయి. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు.



కోటప్పకొండలో తాగునీటి చెరువు

చివరి నుంచి రెండో స్థానంలో బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,622 గృహాలకు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,47,914 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 2,16,874 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

15వ స్థానంలో గుంటూరు జిల్లా

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన తర్వాత 32,409 గృహాల కు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వర కు జిల్లాల్లో 1,57,085 గృహాలకు మాత్రమే కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 87,431 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో ఉంది. జల జీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 161 పనులు మాత్రమే పూర్తయ్యాయి.

నాసిరకం.. అవినీతి

గుంటూరు సిటీ: జల్‌జీవన్ మిషన్ లక్ష్యం ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించడం.. అయితే ఆ నిధుల లేమితో పనులు అరకొరగా జరుగుతుండగా అందులోనూ అవినీతి నిండి పోయింది. పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఇప్పటికే జరిగిన పనులు.. అక్కడక్కడ జరుగుతున్న పనులు చూస్తే నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలకు ఏవిధంగా తిలోదకాలు ఇచ్చారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. జలజీవన్ మిషన్ గ్రామీణ నీటి పారుదలశాఖలోని కొందరి పాలిట వరప్రదాయిని గా మారిందన్న విమర్శలున్నాయి. జల్‌జీవన్ పనులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.400 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేయగా అందినకాడికి దండుకో అన్న రీతిలో కొందరు పంచేసుకుంటున్నా రన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రారంభించిన 1264 పనులు లోపభూయిష్టంగా మారాయి. స్థాయిని బట్టి పర్సంటేజీ నిర్ణయించి మరీ పంపకాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గుంటూరులోని గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనంగా అర్థమవుతోంది. పెదకాకానికిలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి రూ.42 లక్షల పనులకు కాంట్రాక్టర్ నుంచి రూ.1.68 లక్షలు లంచం తీసుకుంటూ ఏఈ శివరామకృష్ణ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలా పనుల మాటేమో కాని ఆ పేరుతో అధికారులు లంచాలు వసూలు చేస్తూ జల్‌జీవన్ మిషన్ నిధులను బొక్కేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నీటి పథకాలను విస్తరించి, పైపులైన్‌లు నిర్మించే పనుల్లో అధికారులు భారీగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పూర్తిగా మామూళ్ల మత్తులో మునగడంతో కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు.

ముఖ్య నేత కనుసన్నల్లో పనులు..


జలజీవన్ మిషన్ పనులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ ముఖ్య నేత కనుసన్నల్లోనే ఎక్కువగా జరుగుతు న్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్య అధికారి పనులన్నీ ఒక వర్గానికి చెందేలా పావులు కదిపారని సమాచారం. వారి ప్రాబల్యంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు నాణ్యతపై ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.



పిడుగురాళ్లలో ఇసుక పోయకుండానే పైపులైన్ నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ పనులు

రాయితీకి.. రాం..రాం

- ఉద్యాన రైతులకు అందని ప్రభుత్వ ప్రోత్సాహం



- కాలయాపనతోనే సరి
- ఏళ్లు గడుస్తున్నా దక్కని మోక్షం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.14 కోట్లు పెండింగ్
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతోన్న రైతులు

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమమే మా ధ్యేయం.. మాది రైతుల ప్రభుత్వం.. అంటూ పాలకులు తరచూ ప్రకటించుకుంటారు. కానీ చేతల్లో మాత్రం అమలు చేయడంలేదు. రాయితీల విషయంలో ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడి కొత్త రకం సాగు, పంటలు వైపు పెద్దసంఖ్యలో మళ్లారు. అయితే వారి మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడిన రైతులు తరచూ వంచనకు గురవుతున్నారు. ఈ కోవలోనే ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు నిలువునా మునిగి పోయారు. సంప్రదాయ పద్ధతులను విడనాడితే అందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తుందని పాలకులు నమ్మబలికి మూడేళ్లు గడుస్తోంది. కానీ రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు మాత్రం మోక్షం కలగడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి రైతులు వేసారి పోతున్నారు తప్పితే బకాయిల విషయంలో ప్రభుత్వం వైపు నుంచి చలనం కరువైంది. చెల్లించాల్సిన వాటి ఊసెత్తని ప్రభుత్వం కొత్త పథకాలు అంటూ ఊదర గొడుతూ ఉద్యాన రైతులను మరో మారు వంచించే కార్యక్రమానికి పాలకులు తెరతీశారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఉద్యాన రైతులు తమకు చెల్లించాల్సిన రాయితీ సొమ్ము కోసం దాదాపు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్పితే పాలకులు రూపాయి విదిల్చకపోవ డంపై రైతులు మండిపడుతున్నారు. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు రూ.14 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు రూ.6.50 కోట్లు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిలకు సంబంధించి త్వరలోనే విడుదల చేయడంతో పాటు ఉద్యాన రైతులకు అందించే ప్రోత్సాహకాల విషయంలో సరికొత్త పాలసీ తెస్తామని గతేడాది ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఆ బకాయిలకు మోక్షం లభించకపోగా కొత్త పాలసీ అంటూ ఉద్యాన రైతులను మభ్యపెట్టే కార్యక్రమానికి ప్రభుత్వం తెరతీయడం గమనార్హం. మిగిలిన పంటలతో పోలిస్తే ఉద్యాన సాగు కు కొంచెం పెట్టుబడి అదనంగా పెట్టాలి. మేలైన విత్త నాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివి రైతు లకు అవసరం. దీంతో ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందుబాటులోకి తెచ్చింది. వీటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. ఈ పరిస్థితుల్లో టీడీపీ హయాంలో రాయితీలను సకాలంలోనే అందించడంతో పెట్టుబడి భారం రైతులకు తెలిసేది కాదు. దీనితో ఏటికేడు ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గతంలో పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మొత్తం పడకేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాకు రూ.25 కోట్లతో ప్రత్యేక రాయితీలు ఉద్యాన రైతులకు అందిస్తామని పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

68,000 హెక్టార్లలో సాగు..

ఉద్యాన పంటల సాగు విషయానికొస్తే ఒక్క బాపట్ల జిల్లాలోనే 29,500 హెక్టార్ల వరకు సాగవుతుందనేది అంచనా. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అయితే ఈ సంఖ్య 68,000 హెక్టార్లుగా ఉంటుంది. ఈ మొత్తంలో 19,000 హెక్టార్ల వరకు మిరపే సాగవుతుండగా మిగిలిన దానిలో అత్యధిక భాగం కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నాయి. గడచిన టీడీపీ ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగుకు అందించే రాయితీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాయితీ సొమ్మును సకాలంలో చెల్లించేవారు. దీంతో 2014--2019 మధ్య కాలంలో ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వృద్ధి నమోదైంది. ఇదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు లక్ష హెక్టార్లకు చేరుకుని ఉండేది. అయితే ప్రభుత్వం శీతకన్ను వేయడంతో ఉద్యాన సాగు తిరోగమనం వైపు పయనిస్తోంది.

మ్యాచింగ్ గ్రాంటు విషయంలోనూ అంతే..

రైతులకు అందించే రాయితీల విషయంలో కేంద్రం వాటాకు రాష్ట్ర ప్రభుత్వం వాటా జమ చేయాలి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం 40 శాతం. అయితే కేంద్రం అందించే నిధులను వేరే అవసరాలకు దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. ఇది గమనించిన కేంద్రం గతేడాది నుంచి ఆ రాయితీను ప్రత్యేక ఖాతాలకు జమ చేయడం ప్రారంభించింది. దీని మూలంగానే కొద్దిమేర చెల్లింపులు జరిగాయి. లేకుంటే ఈ బకాయిల మొత్తం మరింతగా ఉండేదని అన్నదాతలు చెబుతున్నారు.



బస్సు వద్ద చంద్రబాబును కలిసిన నేతలు

గెలుపే లక్ష్యం కావాలి

- నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- రా కదలిరా విజయవంతంపై హర్షం
- దాచేపల్లిలో ముగిసిన చంద్రబాబు పర్యటన

పిడుగురాళ్ల, గుంటూరు సిటీ, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో గెలవబోతున్నాం.. గెలుస్తాం.. మీ అందరూ గెలుపే లక్ష్యంగా బాగా కష్టపడి పనిచేయాలి.. అని టీడీపీ అధినేత పలువురు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. దాచేపల్లిలో రా కదలిరా సభ అనంతరం రాత్రి బస చేసిన చంద్రబాబును ఆదివారం ఉదయం పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలకు సంబంధించి చంద్రబాబు నాయకులకు పలు సూచనలు చేశారని సమాచారం. అదేవిధంగా దాచేపల్లిలో రా కదలిరా సభ అతి తక్కువ సమయంలోనే భారీగా నిర్వహించారని, బహిరంగసభ విజయవంతం చేశారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావును అభినందించారు. బహిరంగ సభకు రెండు రోజులే సమయం ఉన్నా ఏమాత్రం సంశయించకుండా నేను చూసుకుంటా అని చెప్పి అనుకున్న దానికన్నా ఎక్కువగానే విజయవంతం చేశావంటూ యరపతినేని భుజం తట్టి చంద్రబాబు మెచ్చుకున్నారు. ముందుగా బస్సులో లావు శ్రీకృష్ణదేవరాయలు, వున్నం నరసింహారావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, అత్తోట రామ నరసింహారావు చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం గురజాల మండల కన్వీనర్లు, ముఖ్యులను యరపతినేని చంద్రబాబుకు పరిచయం చేశారు. అందరూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నజీర్ అహ్మద్, ఎస్టీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ధారూనాయక్, కంచేటి శివ, సాయి, యరపతినేని నిఖిల్‌తో పాటు పలువురు నేతలు చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం చంద్రబాబు వాహనంలోనే యరపతినేని హెలిపాడ్ వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. ఉదయం 9.20 నిమిషాలకు హెలికాప్టర్ ద్వారా చంద్రబాబు హైదరాబాద్‌కు పయనమయ్యారు. దీంతో చంద్రబాబు పర్యటన దాచేపల్లిలో ముగిసింది.

టీడీపీలోకి వున్నం రీ ఎంట్రీ

ఎన్నికలు సమీపిస్తున్న వేళ గురజాల రాజకీయం రంజుగా మారింది. రెండున్నర దశాబ్దాలుగా టీడీపీకి దూరంగా ఉన్న గురజాల ముఖ్య నేత వున్నం నరసింహారావు, ఆయన కుమారుడు డాక్టర్ నాగమల్లికార్జునరావు ఆదివారం దాచేపల్లిలో చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వారితో చంద్రబాబు మాట్లాడుతూ మీ భవిష్యత్ నేను చేసుకుంటా.. ఎప్పుడూ మర్చిపోనని వారి భుజం తట్టినట్లు తెలుస్తుంది. కొద్ది సేపు నియోజకవర్గ పరిధిలోని వివిధ అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. త్వరలో జానపాడులో భారీ బహిరంగ సభ నిర్వహించి టీడీపీలో చేరేందుకు వారు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.



దాచేపల్లిలో చంద్రబాబుని కలిసిన నరసింహారావు, మల్లికార్జునరావు, ఎంపీ లావు, యరపతినేని

సిద్ధమవుతున్న ప్రభలు

- రూ.5 కోట్లతో 16 ప్రభల నిర్మాణం
- కోటప్పకొండ తిరునాళ్లకు 14 గ్రామాల నుంచి రాక



సిద్ధం చేస్తున్న కోమిటినేనివారి పాలెం ప్రభ

చిలకలూరిపేట, మార్చి 3 : మహాశివరాత్రి.. ప్రభల పండుగ.. కోటయ్య తిరునాళ్లకు.. భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమవుతున్నాయి. తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండకు ప్రభలతో భక్తులు రావడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరిస్థాయిలో వారు ప్రభలను రూపొందించుకుని కోటప్పకొండకు వస్తుంటారు. గ్రామాలకు గ్రామాలు కూడా భారీ విద్యుత్ ప్రభలను రూపొందించి తిరునాళ్లకు రావడం ఇక్కడ ప్రత్యేకత. 90 అడుగుల ఎత్తు ఉండేలా ప్రభలను రూపొందిస్తుంటారు. ఆయా గ్రామాల్లో ప్రభల నిర్మాణానికి సంబంధించి ఏర్పాట్లు ఒక కొలిక్కి వచ్చాయి. ప్రభలను నిలబెట్టి గ్రామస్తులు పెద్దఎత్తున పండుగను చేసుకుని కొండకు బయల్దేరతారు. చిలకలూ రిపేట నియోజకవర్గ పరిధిలో 14 గ్రామాల నుంచి 16 విద్యుత్ ప్రభలు సిద్ధమవుతున్నాయి. ఒక్కొక్క ప్రభకు సుమారు రూ.30 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా. చాలా ప్రభలు 90 అడుగుల ఎత్తు ఉండే విధంగా నిర్మిస్తున్నారు. పురుషోత్తమపట్నం గ్రామం నుంచి ఆరు పెద్ద ప్రభలు, నాలుగు చిన్న ప్రభలు సిద్ధమవుతున్నాయి. కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, అమీన్ సాహెబ్ పాలెం, కోమటినేనివారి పాలెం, అప్పాపురం, కావూరు గ్రామాల్లో ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామంలో రెండు విద్యుత్ ప్రభల నిర్మాణం చివరి దశకు చేరింది. కావూరు గ్రామ ప్రభను 78 సంవత్సరాలుగా వంతుల వారీగా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది నాయుడు ఇంటి పేరు గల వారు రూ.40 లక్షలతో ప్రభను నిర్మిస్తున్నారు. కోమటినేనివారిపాలెం ప్రభ నిర్మాణం కోసం ప్రతి రోజు 40 మంది వరకు గ్రామ స్తులు పని చేస్తున్నారు. గోవిందాపురం గ్రామ ప్రభను ఇరవై ఏళ్లుగా నిర్మిస్తున్నారు. కమ్మవారిపాలెం ప్రభ 15వ వార్షికోత్సవం చేసుకుంటున్నారు. పురుషోత్తపట్నం నుంచి గ్రామ ప్రభ, భైరావారి ప్రభ, విడదలవారి ప్రభ, యాదవ రాజుల ప్రభ, తోట పుల్లప్పగారి ప్రభ, చిన్నతోట గారి ప్రభ నిర్మాణంలో ఉన్నాయి. నరసరావుపేట మండం నుంచి నాలుగు భారీ విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. కాకాని గ్రామంలో రెండు, గురవాయపాలెంలో ఒకటి, ఉప్పలపాడు గ్రామంలో ఒక భారీ విద్యుత్ ప్రభను నిర్మిస్తున్నారు.



తిరునాళ్ళకు సిద్ధం చేస్తున్న అప్పాపురం గ్రామ ప్రభ

గ్రిడ్ విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆయా గ్రామాల నుంచి కోటప్పకొండకు ప్రభలు 7వ తేదీ తరలివెళ్లనున్నాయి. కోటప్పకొండకు దగ్గరలో ఉన్న యూటీ అనే ప్రదేశం మీదగా ప్రభలు తరలివెళ్లే మార్గం. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలోని ఇతర రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ అనుసందానంగా ఉన్న 400 కేవీ విద్యుత్ లైన్లలో సరఫరాను నిలిపి వేస్తారు. ఆ ప్రాంతాన్ని ప్రభలు దాటిన తర్వాత తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కూడా ఇదే విధంగా విద్యుత్ సరఫరా సుమారు గంట పాటు ఆపేస్తారు.



పేట్లు మోగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అమరావతి మహిళలు

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపారు

● 1538వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి3: అప్పుల ఊబిలోకి సీఎం జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ని నెట్టాడని, అప్పుల చేయటం కోసం ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెడుతున్నాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, సేవ్ ఏపీ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1538వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, సంపదనిచ్చే అమరావతి రాజధానిని నిర్వీర్యం చేస్తూ, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి పరిపాలన చేయటం హేయమన్నారు. అప్పు కోసం రాష్ట్ర సచివాలయాన్ని వదలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు అంటూ వేల కోట్లు అప్పుల చేసి, జనం నెత్తిన రుణభారం మోపాడన్నారు. రేపు ప్రజల ఆస్తులను కూడా వైసీపీ ప్రభుత్వం వదలదన్నారు. లాక్కొని మరీ తాకట్టు పెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని ఆరునెలల్లో అభివృద్ధి చేయమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించి నేటికి రెండు సంవత్సరాలైనా సీఎం జగన్‌రెడ్డికి చీమ కుట్టినట్టుగా లేకపోవటంతో తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో కంచాలు మోగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

గణపవరంలో బంగారం, నగదు చోరీ

నాదెండ్ల, మార్చి 3: మండలంలోని గణపవరం గ్రామంలో ఆదివారం పట్టపగలే ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో నాలుగు సవర్ల బంగారంతో పాటు రూ 30వేల నగదును అపహరించారు. పశువుల ఆస్పత్రి సమీపంలో గల రోడ్డులో మేఘనా ఆయిల్ మిల్లులో బత్తుల శ్రీనివాసరావు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య, కుమార్తె ఇంటికి తాళం వేయకుండా పక్కింటికి వెళ్ళారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి బీరువాలోని బంగారం, నగదును చోరీ చేశాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌ని తీసుకొని పరిశీలిస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

● రైతులు, రైతు సంఘాల నాయకుల ధర్నా, రాస్తారోకో

దుగ్గిరాల, మార్చి3: దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతులకు తక్షణం న్యాయం చేయాలంటూ బాధిత రైతులు, రైతు సంఘాల నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీక్షా శిబిరం నుంచి రైతులు తెనాలి- విజయవాడ మెయిన్‌రోడ్డులోని పాతలాకుల వద్దకు చేరుకుని ధర్నా ప్రారంభించారు. తెనాలి- విజయవాడ ప్రధాన రహదారి కిరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి ప్రమాదం జరిగి 43 రోజులైనా ఇంతవరకూ బీమా సంస్థలు, యాజమాన్యంగానీ, అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడలేదని అన్నారు. రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చొరవచూపి న్యాయం చేయకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పసుపు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నా శివశంకర్, కోల్డ్‌స్టోరేజి ప్రమాదబాధిత రైతుల కమిటీ నాయకులు వేముల వెంకట్రామయ్య, జిల్లా తెలుగు రైతు నాయకుడు కల్లం రాజశేఖరరెడ్డి, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, జెట్టి బాలరాజు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, రామిరెడ్డి, వీరాంజనేయులు, కాజా వెంకటేశ్వరరావు, పోతురాజు, రమాదేవి పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దుగ్గిరాల పాతలాకు వద్ద తెనాలి-విజయవాడ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న కోల్డ్‌స్టోరేజ ప్రమాదబాధిత రైతులు, రైతుసంఘాల నాయకులు

ఓటర్లకు వైసీపీ తాయిలాలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్టిక్కర్లతో పంపిణీ చేసిన కుక్కర్లు

పెదకూరపాడు, మార్చి 3: రాబోయే ఎన్నికల నేపథ్యంలో వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు, అతని కుటుంబ సభ్యులు మహిళలకు రైస్ కుక్కర్లను, వలంటీర్లు, వైసీపీకి చెందిన కొంతమంది మహిళలతో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లతో, వలంటీర్లతో, గ్రామస్థాయి సిబ్బందితో బహిరంగంగా సమావేశాలు ఏర్పాటు చేసి వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. పార్టీలో అసమ్మతి రాగం వినిపిస్తున్న పలువురు ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించేందుకు తాయిలాలను ఎరగా వేస్తున్నారు. మరో వైపు ఎమ్మెల్యే శంకరరావు ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడుతున్న సమయంలో పలు గ్రామాల్లో శంకుస్థాపనలకు తెర లేపారు.

చెక్‌పోస్టులు, బల్లకట్టుల తనిఖీ



పుట్లగూడం బల్లకట్టును పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట, మార్చి 3: ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా అంతరాష్ట్ర చెక్ పోస్టులను ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు చేపడుతున్నారు. పులిచింతల, మాదిపాడు చెక్‌పోస్టులతో పాటు పుట్లగూడం బల్లకట్టులను తనిఖీ చేశారు. చెక్ పోస్టుల నిర్వహణ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

రాజధాని గ్రామాల్లో పోలీసు కవాతు



అనంతవరం గ్రామంలో కవాతు చేసున్న పోలీసులు

తుళ్లూరు, మార్చి 3: మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల జరగనున్న నేపథ్యంలో అనతంవరం, నెక్కల్లు, వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్), స్థానిక పోలీసులు కవాతు జరిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు వారు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తుళ్లూరు సీఐ సుభాని ఈ సందర్భంగా తెలిపారు.

స్కూల్ ప్రహరీ కూల్చివేత

● రోడ్డు కాంట్రాక్టర్ నిర్వాకం



కూల్చి వేసిన స్కూల్ ప్రహరీ

చుండూరు, మార్చి 3: ముందస్తు అనుమతులు పొందకుండా రోడ్డు కాంట్రాక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కాంట్రాక్టర్ చుండూరు, మోదుకూరు మధ్య రోడ్డు నిర్మాణం చేపడుతున్నాడు. ఈ క్రమంలో మోదుకూరులోని శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రహరీని కూల్చివేశాడు. దీనిపై పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం పేరుతో రోడ్డుకు ఇరువైపులా భారీ గోతులు తవ్వి మట్టిని తలరించుకుని వెళ్ళిన సంగతి ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. నిర్మాణ పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నా ఆర్ అండ్ బీ, ఇంజనీరింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా అధికార పార్టీ, నియోజకవర్గ నాయకుడు అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు పనులు పర్యవేక్షించి అనుమతులు లేకుండా కూల్చిన స్కూల్ ప్రహరీని కాంట్రాక్టర్ చేతే తిరిగి నిర్మాణం చేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులు న్యాయం చేయలేదంటూ.. మహిళ ఆత్మహత్యాయత్నం





మహిళ ఇంటిపై దాడి చేయడంతో దెబ్బతిన్న సామాగ్రి, చికిత్స పొందుతున్న బాధితురాలు ప్రియాంక

కొల్లూరు, మార్చి 3: తన కేసులో పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఓ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. క్రాప గ్రామానికి చెందిన గుడిపూడి కిరణ్, శిరీష దంపతులకు ఓ బాబు ఉన్నాడు. కాగా కిరణ్‌కు ప్రియాంక అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. తన భర్త ఇంటికి రాకుండా ప్రియాంక వద్ద ఉంటున్నాడనే కారణంతో శిరీష ఆ మహిళ ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. అయితే తనపై, తన తల్లిపై ఆమె దాడి చేసిందని ఆరోపిస్తూ ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడి జరిగినా తనకు పోలీసులు న్యాయం చేయలేదంటూ సదరు మహిళ ఎలుకల మందు తాగింది. గమనించి బాధితురాలి తల్లి చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం తెనాలిలోని వైద్యశాలకు తరలించారు. తన ఆత్మహత్యాయత్నానికి కారణం పోలీసులేనంటూ ఆమె ఆరోపించింది. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. ఈ విషయంపై ఎస్ఐ రవీంద్రరెడ్డిని వివరణ కోరగా వైద్యశాలలో ఆమె నుంచి వాంగ్మూలం తీసుకున్నామని, దాడి చేసిన మహిళపై కేసు నమోదు చేశామని తెలిపారు.

తపాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భారతీయ తపాల ఉద్యోగుల సంఘం(బీపీఈఏ) గుంటూరు డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఆదివారం అరండల్‌పేట హెడ్ పోస్టాఫీసులో సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య అధ్యక్షతన అసోసియేషన్ ప్రథమ ద్వైవార్షిక సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ మురళీకృష్ణ, కోశాధికారిగా కె.బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖర్, కె.కిరణ్, ఎ.వంశీకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వీరవసంతరావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తపాల ఉద్యోగులకు పెన్షన్ సాధించిన ఘనత బీపీఈఏకి దక్కుతుందన్నారు. హైకోర్టు అడ్వొకేట్ బి.జయభారతరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయపరంగా తాను అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.కోదండరామయ్య, తెనాలి డివిజన్ నుంచి బి.బాలకృష్ణ బి.రవికిరణ్‌కుమార్, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



గోపిరెడ్డి (ఫైల్)

బాపట్లరూరల్, మార్చి 3: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన ఆదివారం బాపట్ల మండలం చుండూరుపల్లి గ్రామసమీపంలో చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణం ఉప్పరపాలెంకు చెందిన శవనం గోపిరెడ్డి (30) కానిస్టేబుల్‌గా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం సమయంలో ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు నుంచి బాపట్లకు వస్తున్న సమయంలో ఈతేరు- చుండూరుపల్లి గ్రామాల మధ్యలోని గుంటూరు రహదారిపై ఎదురుగా వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయటానికి ప్రయత్నం చేసే క్రమంలో లారీకి తగిలి కిందపడటంతో బాపట్ల వైపు నుంచి గుంటూరు వైపుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టటంతో గోపిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు 2018కి చెందిన బ్యాచ్ కానిస్టేబుల్. మృతుడు గోపిరెడ్డికి సంవత్సరం క్రితం వివాహం జరిగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రదేశానికి చేరుకొని కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు, హాజరైన హైదరాబాదులో నివాసం ఉండే నియోజకవర్గ ఓటర్లు

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

● హైదరాబాదులో వేమూరు నియోజకవర్గ ఓటర్లతో ఆనందబాబు

వేమూరు, మార్చి 3: రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని మియాపూర్‌లో విశ్వనాథ్ కనెక్షన్ హాల్లో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వేమూరు నియోజకవర్గం ఆధ్వర్యంలో హైదరాబాదులో నివశిస్తున్న నియోజకవర్గ ఓటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆనందబాబు మాట్లాడుతూ జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రతి ఓటరు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ చంద్రబాబునాయుడు ప్రజాహితమైన పాలన సాగించిన విషయం అందరికీ తెలుసన్నారు. జగన్ దుర్మార్గాలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజాజీవితం నుంచి తరిమికొట్టాలని ఇందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఓడిపోవడం ఖాయం అనే విషయం గ్రహించి జగన్ తిరిగి ఏదో ఒక విధంగా అధికారంలోకి రావాలని అనేక అడ్డదారులు తొక్కుతున్నారని అన్నారు. తాను ఓడిపోతే శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందన్న విషయం కూడా జగన్ గ్రహించారని పేర్కొన్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సుదీర్ఘమైన ఆలోచనతో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కూడా సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం జరిగిందన్నారు. హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న వేమూరు నియోజకవర్గ ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేయాలని కోరారు. వేమూరు నియోజకవర్గం నుంచి నాలుగోసారి పోటీలో ఉండటం జరుగుతుందని గతంలో రెండుసార్లు తనను గెలిపించి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఒక స్థానాన్ని కల్పించిన నియోజకవర్గ ఓటర్లకు ఎంతో రుణపడి ఉంటారని అన్నారు. నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు ఎన్నికలకు హాజరై తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే వివేకా హత్య

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 3: సొంత చెల్లెలకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని అక్కా చెల్లెళ్ళకు ఏం న్యాయం చేస్తారని? టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై సమగ్ర విచారణ జరగాలన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్ ముఠా వివేకానందరెడ్డిని హత మార్చిందని బహిరంగ రహస్యమేనన్నారు. ఎన్నికల ముందు సీబీఐ విచారణ కోరిన వైఎస్ జగన్ ఎన్నికల అనంతరం వివేకానందరెడ్డి కుమార్తె సునీత సీబీఐ విచారణ కోరితే ఎందుకు ఆపించారని? ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అయిన తరువాత సీబీఐ విచారణ పిటిషన్‌ను జగన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారని? ప్రశ్నించారు. తండ్రికి న్యాయం చేయాలంటూ సునీత పోరాడుతుంటే మరోవైపు తమ్ముడు అరెస్టు కాకుండా జగన్ కాపాడుతున్నాడన్నారు. గతంలో కర్నూలులో అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు వస్తే ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టించింది వైసీపీ నేతలేనన్నారు. సునీత అడుగుతున్న ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. విలువల గురించి పదే పదే మాట్లాడే వైసీపీ నేతలు ఇప్పటికైనా విలువల గురించి మాట్లాడటం మానుకోవాలన్నారు.

మహా శివరాత్రికి 182 స్పెషల్ ఆర్టీసీ బస్సులు

● డీపీటీవో రవికాంత్

గుంటూరు, మార్చి 3: ఈనెల 8న జరుగనున్న మహా శివరాత్రికి శైవక్షేత్రాల కోసం ఆర్టీసీ గుంటూరు జిల్లా నుంచి 182 స్పెషల్ బస్సులను సిద్ధం చేసింది. ప్రముఖ శైవక్షేత్రాలైన కోటప్పకొండతో పాటు అమరావతి వంటి శైవక్షేత్రాలకు నిరంతరం బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి శైవక్షేత్రాల కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు నుంచి అమరావతికి 17, గుంటూరు శ్రీశైలానికి 40, గోవాడకు 36, క్వారీకి 42 బస్సులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అదనపు సర్వీసుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి కోటప్పకొండకు 265 బస్సులు, చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు 100, అలానే కోటప్పకొండ కింద నుంచి కొండపైకి భక్తుల రాకపోకల కోసం 60 మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలానే భక్తుల కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాగళం కార్యక్రమం వాయిదా

కొల్లూరు, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తలపెట్టిన నూతన కార్యక్రమం ప్రజాగళం సభలు వాయిదాపడ్డాయి. ఈ నెల 6వ తేదీన ప్రజాగళం పేరుతో చంద్రబాబు పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొనేవిధంగా ఐదు రోజుల పాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రజాగళం కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ వాయిదా వేసింది. దీంతో 7వ తేదీన కొల్లూరు మండలం దోనేపూడి వద్ద జరగాల్సిన ప్రజాగళం బహిరంగ సభ వాయిదా పడింది. తదుపరి కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర పార్టీ సమాచారం మేరకు సభ నిర్వహణ ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆదివారం తెలిపారు.

7న గుంటూరులో కాంగ్రెస్ బహిరంగసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేడీ శీలం, మస్తాన్‌వలి, ఈశ్వరరావు తదితరులు

గుంటూరు, మార్చి 3: గుంటూరు వేదికగా ఈనెల 7న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. గుంటూరు రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి రోడ్డులోని సులేమాన్‌ఖాన్ పొగాకు కంపెనీ స్థల ప్రాంగణంలో 7న మధ్యాహ్నం 3 గంటల నుంచి బహిరంగసభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. సభకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇతర ఏఐసీసీ నేతలు హాజరవుతు న్నట్లు తెలిపారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మాట్లా డుతూ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి జంగా గౌతమ్ కాంగ్రెస్‌జిల్లా, నగర అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ ఉస్మాన్, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ నేతలు జగన్మోహన్‌రెడ్డి, కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాలలకు సముచిత స్థానం కల్పించాలి

● మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు



మాట్లాడుతున్న మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

బాపట్ల, మార్చి 3: రాజకీయపార్టీలు మాలలకు సముచిత స్థానం కల్పించాలని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. బాపట్ల క్రిస్టియన్ భవన్‌లో ఆదివారం రాత్రి మాలమహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన సభ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన ఈ సభకు వెంకట్రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీవర్గీకరణ తీర్పు వెల్లడించకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్గీకరణ చేసేందుకు కలెక్టర్‌లకు ఆదేశాలివ్వటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆ సర్క్యులర్‌ను రద్దుచేయాలని తీర్మానించారు. రాష్ట్రం లో 65శాతం ఉన్న మాలలకు అన్ని రాజకీయపార్టీలు రానున్న ఎన్నికలలో 20 అసెంబ్లీ, 4 పార్లమెంట్ సీట్లు కేటాయించాలన్నారు. బాపట్ల పార్లమెంట్‌లో 5లక్షలకు పైగా మాల ఓటర్లు ఉన్నందున ఆ సీటును మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ అంశాలపై చర్చించి సభలో ఏకగ్రీవ తీర్మానాలు చేశారు.కార్యక్రమంలో మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, జాతీయనాయకులు గోళ్ళ అరుణ్‌కుమార్, మాలమహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్, తెలంగాణ అధ్యక్షుడు చందా లక్ష్మణ్ బిట్టా, మాలమహానాడు అధ్యక్షులు బేతాళ శరత్‌బాబు, మాలమహాసేన నాయకులు అలగా రవికుమార్, గోదాజాన్ పాల్, బుర్గుల వెంకటేష్, కె.కిషోన్, జి.రమేష్, డాక్టర్ పాల్, మన్నె శ్రీధరరావు, పి.రామమూర్తి, కొండబాబు, డాక్టర్ జి. చార్వాక, నీలం నాగేంద్రరావు, దగ్గుమళ్ళ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

పొన్నూరుటౌన్, మార్చి3: పొన్నూరు పట్టణంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడుతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో పి.శైలజ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని పాతపొన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ నజీర్ అహ్మద్ స్కూలులో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన్నట్లు బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో నజీర్ అహ్మద్‌ను సస్పెండు చేశారు. అదే విధంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం టి .విజయ్ కుమార్‌ను కూడా సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

పల్నాడు వార్తలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని

టీడీపీ, జనసేన సునామి సృష్టించబోతోంది

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మార్చి 3 : రాబోయే 40 రోజుల్లో ఏపీలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సునామి సృష్టించబోతున్నాం... 150 సీట్లు సాధించి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. దాచేపల్లిలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. యరపతినేని మాట్లాడుతూ దాచేపల్లిలో జరిగిన రా...కదలిరా సభకు ముఖ్యఅతిథిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకాగా లక్ష మందికి పైగా ప్రజలు తరలిరావడం అపూర్వమన్నారు. ఈ సభను చూస్తే 2013 సెప్టెంబరు నెలలో పొందుగల వద్ద ప్రారంభమైన ఆత్మగౌరవయాత్ర గుర్తుకొస్తుందన్నారు. ఆనాడు లక్ష మందితో చంద్రబాబునాయుడుకు స్వాగతం పలకడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాలో తరిమిన వ్యక్తిని ఇక్కడ పెట్టి గొప్పలు చెబుతున్నారు. బీసీలపై దాడులు చేసినప్పుడు ఈ నాయకులు ఒక్కరు కూడా మాట్లాడలేదు. తోట చంద్రయ్య, ఎల్లయ్య, పిచ్చయ్య అంతా బీసీలు కదా.... వీరిపై దాడులు చేసి హత్యలు చేసినప్పుడు ఈ నాయకులంతా ఏమి చేస్తున్నారని యరపతినేని ప్రశ్నించారు. బీసీ కులాలు ఎందుకు సంఘీభావం ప్రకటించలేదు. అనిల్‌కుమార్‌యాదవ్ ఎందుకు బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపలేదు. మీ రాక్షస కాండకు చనిపోయిన వారి కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని యరపతినేని డిమాండ్ చేశారు. బరితెగించిన విధానంతో వైసీపీ ఓటమి అంచున వుంది. రాజధాని లేకుండా చేశారు....జగన్ ఓ నియంత....నియంతలు ఎప్పుడు కూడా ఒంటరిగానే మిగిలిపోతారు. టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారనేది నిన్న జరిగిన సభ విజయవంతంతోనే అర్థమైందని యరపతినేని వివరించారు. ఈ సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, పులుకూరి కాంతారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, వేముల వినోద్‌రెడ్డి, అక్కినపల్లి బాలయ్య, చికెన్ జానీబాషా, నెల్లూరి రామకోటయ్య, సొసైటీ నారాయణ, నర్రా పుల్లయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, మామిడి చంద్రశేఖరరావు, వేముల తిరుమలకుమార్, కూరాకుల నాగేశ్వరరావు, మందపాటి దుర్గారావు, అంబటి మల్లి, తదితరులున్నారు.

మాపై దాడులు చేయడమే కాకుండా...

ఆడవాళ్లను కూడా జైలుకు పంపారు

● చంద్రబాబుకు తమగోడును వినిపించిన రామాపురం మహిళలు



చంద్రబాబును కలిసి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న రామాపురం గ్రామ టీడీపీ నాయకులు వేముల వినోద్‌రెడ్డి, మహిళలు

దాచేపల్లి, మార్చి 3 : గత ఏడాది దసరా ఉత్సవాలలో వైసీపీ నాయకులు మా ఇళ్ల ముందుకు వచ్చి గలాట సృష్టించడంతో పాటు తమపై దాడిచేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా కేసులు పెట్టి మహిళలను కూడా వైసీపీ నాయకులు జైలుకు పంపారని దాచేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మహిళలు చంద్రబాబు వద్ద విలపించారు. దాచేపల్లి సభకు వచ్చిన చంద్రబాబును ఆదివారం హెలిపాడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి చంద్రబాబుకు తమపై జరిగిన దాడులను వివరించారు. తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేముల వినోద్‌రెడ్డి, మహిళలు వేముల నాగమణి, ఆకూరి కొండమ్మ, వేముల లింగమ్మలు చంద్రబాబుతో మాట్లాడుతూ మా ఇళ్లపై దాడిచేసి మా ఇంట్లోని మగవారిని రాళ్లతో మోదీ తీవ్రంగా గాయపరిచారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తాము ఆసుపత్రులకు వెళ్తే పోలీసులతో కుమ్మక్కైన వైసీపీ నేతలు మాపై 307 సెక్షన్‌పై కేసులు పెట్టి జైలుకు పంపారని విలపించారు. మాజీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ భయపడాల్సిన అవసరం లేదు యరపతినేని శ్రీనివాసరావు, నేను మీకు అండగా వుంటాం.. ఈ దుర్మార్గమైన పరిపాలనకు రోజులు దగ్గరపడ్డాయని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఆటోడ్రైవర్లే గుంతలు పూడ్చారు

● పల్నాడులో రహదారులపై ఆటోలు నడపలేమని ఆవేదన



గుంతలు పూడ్చుతున్న ఆటో యూనియన్ నేతలు

పిడుగురాళ్ల, మార్చి 3 : ఐదేళ్లుగా రోడ్లపై వున్న గుంతలు పూడ్చాలని ఎన్నో సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులకు చెప్పుకుంటూ వచ్చాం. కొత్త రోడ్డు వేయకపోయినా పర్వాలేదు.. ఉన్న రోడ్డును బాగుచేయాలని కోరినా ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో చివరకు ఆటో డ్రైవర్లే నడుం బిగించారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు టోల్‌గేట్ సమీపం నుంచి పిన్నెల్లి గ్రామానికి వెళ్లే 4 కిలోమీటర్ల రహదారి అంతా గోతులమయమైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో ఆదివారం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొందరు ఆటో డ్రైవర్లు సొంత ఖర్చులతో రహదారిపై ఉన్న గోతులకు మట్టిని తోలించి గతుకులు పూడ్చి వేయించారు. ప్రభుత్వం చేయలేని పని తామే స్వచ్ఛందంగా చేస్తున్నామని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

దాచేపల్లి, మార్చి 3: శంకర నేత్ర వైద్యశాల, మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన వైద్యశిబిరానికి మండలం నలుమూలల నుంచి 743 మంది హాజరయ్యారు. వీరిలో 325 మందికి కంటి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. వీరందరికీ దశల వారీగా ఆపరేషన్లు, కళ్లజోడు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మదర్ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు నాగెండ్ల సుమతీరత్నం, మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, డాక్టర్ గీతారాణి, తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి విలువలతో కూడుకున్నది

దాచేపల్లి, మార్చి 3: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువలతో కూడుకున్నదని, సమాజానికి ఉన్నతమైన పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయుడేనని పలువురు వక్తలు అన్నారు. నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో ఆదివారం ఉపాధ్యాయుడు చంద్రశేఖరశాస్త్రి దంపతులకు ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఉపాధ్యాయులు పదవీ విరమణ సభను ఏర్పాటు చేశారు. ఈ సన్మానసభలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, కోసూరి రవికుమార్, చిట్టిపోగు ఏసురత్నం, సోమి వెంకటరమణ, రావిపాటి వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ జిల్లా నాయకులు వట్టెపు నాగేశ్వరరావు, బర్నా వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, సభకు అధ్యక్షులుగా టి. కల్యాణి వ్యవహరించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

పిడుగురాళ్ల, మార్చి 3: పిడుగురాళ్లకు చెందిన తెలుగు గ్రేడ్-1 పండిట్ కందుల పుల్లయ్య శనివారం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. టీడీపీ నాయకులు వడ్డవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్‌అలి, సాంబశివరావు, రమణ, తదితరులు పుల్లయ్య మాస్టార్ సేవలను గుర్తుచేస్తూ కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేశారు.

బ్రాహ్మణులకు అండగా తెలుగుదేశం : కన్నా

సత్తెనపల్లి, మార్చి 3 : బ్రాహ్మణులకు తెలుగుదేశం అండగా ఉంటుందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సత్యధ్యాన మందిరంలో కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం జరిగింది. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణుల అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గణపవరపు రంగారావు, మృత్యుంజయరావు, మాటేటి నాగరాజు, జీ.అమరనాథ్, కృష్ణమాచార్యులు, సీతారామశాస్త్రి, చౌట శ్రీనివాసరావు, విజయ రామారావు, బీ.సుబ్రహ్మణ్యం, జే.రాము, ఆతుకూరి నాగేశ్వరరావు, మణికంఠ పాల్గొన్నారు.

28, 29వ వార్డుల్లో పలువురు టీడీపీలో చేరిక

పట్టణంలోని 29వ వార్డులో ఆదివారం సాయంత్రం షేక్ బాజీ ఆధ్వర్యంలో 50 కుటుంబాల మైనార్టీలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. వార్డుకు వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ పెద కరిముల్లా, రాంబో బుడే, సయ్యద్ మాబూ, దూదేకే, ఆతుకూరి నాగేశ్వరరావు, బచ్చే బాబు, పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 28వ వార్డు దోబీ ఘాట్‌కు చెందిన రజకులు ఆదివారం రాత్రి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో యామర్తి ఆంజనేయులు, సత్తెనపల్లి శ్రీనివాస్, బల్లగిరి నరసింహారావు, బలుసుపాటి వెంకటేశ్వరరావు, కురిచేటి నాగేశ్వరయ్య, సత్తెనపల్లి హరిబాబు, నీలం పెద్దారావుల ఆధ్వర్యంలో 150 రజక కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ నేతలు నూర్ బాషా జానీబాబు, యామర్తి చిన్న, తొరటి వెంకటరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్ మాబూ, సయ్యద్ పెద కరిముల్లా, దోబీఘాట్‌కు చెందిన రజక నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముప్పాళ్ల, మార్చి 3 : ముప్పాళ్ల మండలం మాదలలో ఆదివారం రాత్రి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రావిపాటి మధుబాబు ఆధ్వర్యంలో 25 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ అభ్యర్థి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు,



టీడీపీలో చేరిన 150 రజక కుటుంబాలతో కన్నా లక్ష్మీనారాయణ

నాయకులు రావిపాటి నానయ్య, గ్రామ, మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

పలుదేవర్లపాడులో కన్నా ప్రచారం

ముప్పాళ్ల మండలంలోని పలు దేవర్లపాడులో ఆదివారం రాత్రి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకో ముఖ్య మంత్రిని సాగనం పాలన్నారు. గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో ప్రచారానికి వచ్చిన కన్నాకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షు డు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు పాతూరి అయోధ్య రామారా వు, ఈశ్వరరావు, అత్తోట కృష్ణ, ముత్యాల చిన్న, కంభంపాటి రమేష్, శిరిగిరి శ్రీనివాసరావు, గరికపాటి వెంకటేశ్వర్లు, అత్తోట వెంకట కృష్ణారావు, వస్త్రాల కోటేశ్వరరావు, షేక్ సైదులు, చిలకా సాంబశివరావు, రావిపాటి నానయ్య, గ్రామ, మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాలయోగికి కన్నా నివాళులు

సత్తెనపల్లి, మార్చి 3 : లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని ఆదివారం పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల టీడీపీ ప్రజా వేదికలో నిర్వహించారు. బాలయోగి చిత్రపటానికి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చౌట శ్రీనివాసరావు, అంకాళ్ళ ప్రభుదాసు, బలిజేపల్లి సురేష్, బండారు నాగరాజు, వాసా వెంకటేశ్వర్లు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు పాల్గొన్నారు.

రెండు పోలియో చుక్కలు జీవితానికి రక్ష : కమిషనర్

సత్తెనపల్లి, మార్చి 3 : రెండు చుక్కలు నిండు జీవితానికి రక్ష అని మునిసిపల్ కమిషనర్ కే.షమ్మి అన్నారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవ స్థానం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఏరియా వైద్యశాలలో మంత్రి అంబటి రాంబాబు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని 34 పోలియో కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పీపీ యూనిట్ డాక్టర్ అనూష తెలిపారు. ఒక మొబైల్ వాహనం ద్వారా కూడా పోలియో చుక్కలు వేశామన్నారు. ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేయించని తల్లిదండ్రులు 4, 5, 6 తేదీల్లో గృహాలకు వచ్చే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయించాలన్నారు.



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మునిసిపల్ కమిషనర్ షమ్మి

● సత్తెనపల్లి రూరల్, మార్చి 3 : మండలంలోని ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 6874 మంది పిల్లలకు గాను 6,601 పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు పీహెచ్‌సీ డాక్టర్ వీ.ప్రదీప్ తెలిపారు. గ్రామాల్లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాల్లో డాక్టర్లు కవిత, గౌతమి, సాయి తేజారెడ్డి, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, మార్చి 3: మండలంలోని కంభంపాడు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యులు ప్రదీప్, అరుణ్ పర్యవేక్షించారు. మండలంలోని జమ్మలమడకలో నిర్వహించిన పల్స్ పోలియోను సర్పంచ్ ముక్కా చౌడమ్మ, గురవయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నరసింహారావు, బీవీ రావు, హెచ్‌వి విజయ, హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 3 : రెండు చుక్కలు నిండు జీవితానికి వెలుగులు అని ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇందిరాబొమ్మ సెంటర్ ఐఎన్‌సీ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అక్బర్, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.

● దుర్గి, మార్చి 3 : దుర్గి మండలంలో ఆదివారం పల్స్ పోలియో 96 శాతం పూర్తయినట్లు వైద్యాధికారి వలపా పెద సైదులు తెలిపారు. మండలంలో 17 బూత్‌లతోపాటు ఒక మొబైల్ టీం ద్వారా 65 మంది సిబ్బంది సేవలందించారన్నారు. 2581 మందికి గాను 2484 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● రెంటచింతల, మార్చి 3 : రెండు పోలియో చుక్కలతో జీవితం నిండుగా ఉంటుందని, ఎలాంటి వైకల్యాలు సంభవించవని ఎంపీపీ పాముల సంపూర్ణ అన్నారు. పీహెచ్‌సీలో చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. 20 కేంద్రాల్లో 3679 మందికి గాను 3569 మంది చిన్నారులకు అంటే 97.43 శాతం మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. 120 మందికి అల్పాహారం, మజ్జిగ, భోజన సదుపాయాలు కల్పించిన నరేంద్రారెడ్డి, ఏచూరి వెంకట సైదయ్య, రామారావులను ఎంపీపీ సంపూర్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, సర్పంచ్ పేర్ల చౌడమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శౌరైడ్డి పాల్గొన్నారు.

● పెదకూరపాడు, మార్చి 3 : నిండైన జీవితానికి రెండే చుక్కలను వేయిం చాలని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకూరపాడు మండలంలోని 75 తాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆది వారం చిన్నారులకు పోలియో చుక్కలను వేసి ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు వెలుగొండారెడ్డి మాట్లాడుతూ మండలంలో 3,435 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని, 238 మంది వలస కూలీ పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, హెల్త్ సిబ్బంది విజయకుమార్, దిలీప్, శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

● క్రోసూరు, మార్చి 3 : క్రోసూరు మండలంలో 4,601 మందికి పల్స్ పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారి రమాదేవి తెలిపారు. క్రోసూరు నాలు గు రోడ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఎమ్మెల్యే నంబూ రు శంకరరావు పిల్లలకు పోలియో చుక్కలు వేసి మండలంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ బాల అంకమ్మ బాయి, డాక్టర్ సిరి చందనలతో పాటు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, కమ్యూనిటీ హెల్త్ అఫీసర్ సాంబశివరావు కూడా పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, మార్చి 3: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలి, డాక్టర్ కొండవీటి రామకోటయ్య, సత్యప్రసాద్, చందోలు నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ శివలీల పాల్గొన్నారు.

● విజయపురిసౌత్, మార్చి 3: మాచర్ల మండలం కొప్పునూరు పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో 97 శాతం నమోదైంది. వైద్యాధికారి ప్రవీణ్ ఆధ్వర్యాన కొప్పునూరు, అలుగురాజుపల్లి, హస్నాబాద్‌తండా, నాగులవరం, టీకేవీపాలెం, సుబ్బారెడ్డిపాలెం, బోదనంపాడు చెంచుకాలనీ, చింతలతండా, అనుపు చెంచుకాలనీ, విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయం, లాంచీ స్టేషన్, డౌన్ మార్కెట్, లంకమోడు ప్రాంతాల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక లాంచీ స్టేషన్ వద్ద లాంచీ యూనిట్ మేనేజర్ శివారెడ్డి పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో వైద్యులు చార్లెస్ వెస్లీ, ముక్తియార్ జాని, సూపర్‌వైజర్ సుబ్బాచారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

●నకరికల్లు, మార్చి 3 : పోలియో లేని రాష్ట్రంగా చేసేందుకు ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బీ.రవి తెలిపారు. ఆదివారం మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నకరిక ల్లు పీహెచ్‌సీ పరిధిలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు 3,226 మందికి గాను 3,091 మందికి, కుంకలగుంట పీహెచ్‌సీ పరిధిలో 2,753 మందికిగాను 2,639 మందికి 96 శాతం పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవి నాగమణి భ్రమరాంబ, కుంకలగుంట పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.పూజశ్రీ, నకరికల్లు పీహెచ్‌సీ డాక్టర్ బీ.మణికంఠ, కే.వెంకటేశ్వర్లు, ఎన్.ప్రశాంత కుమారి, ఎం.లీలాకృష్ణ, వై.వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● అచ్చంపేట, మార్చి 3 : మండలంలో 94 శాతం చిన్నారులకు ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేసినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి పీ.వెంకటరావు తెలిపారు. ఎంపీపీ భూక్యా రజినీ బాయి తాడువాయిలో పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. మండలంలో 36 కేంద్రాలు ఉండగా డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ఇన్నారావు పర్యవేక్షించారు. తాడువాయిలో ఏఎన్ ఎం ఎస్.న రసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.సుమతి, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, గ్రామ సర్పంచ్ మంత్రా నాయక్ పాల్గొన్నారు. అచ్చంపేటలో జరిగిన కార్య క్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాపరెడ్డి పోలియో చుక్కలు వేశారు.

● పిడుగురాళ్ల, మార్చి 3 : పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. 97 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని వైద్యాధికారి ప్రభావతి తెలిపారు. 3 వేల 077 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగింది.

● రాజుపాలెం, మార్చి 3: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో మొత్తం 23 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా 3744 మంది చిన్నారులకు పోలి యో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి కెవి కృష్ణకుమార్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులు మొత్తం 3985 మంది వుండగా 93 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. కొండమోడులోని పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రవి ఆకస్మిక తనిఖీలు చేసి పల్స్ పోలియో వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

● మాచవరం, మార్చి 3 : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 96 శాతం నమోదైనట్లు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. మిగిలిన నాలుగు శాతాన్ని సోమ, మంగళవారాలలో పూర్తి చేయడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, ఉప ఎంపీపీలు చింతపల్లి నన్నేసైదా, చల్లగుండ్ల శివ, జడ్పీటీసీ శివయాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు అన్వేష్, నస్రీన్, ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసంపై తమకు సంబంధం లేదు'

విజయపురిసౌత్, మార్చి 3 : మాచర్ల మండలం కొప్పునూరులో వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసంపై తమకెటువంటి సంబంధం లేదని టీడీపీ, జనసేన నేతలు అన్నారు. కొప్పునూరులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసంపై టీడీపీ, జనసేనపై ఆరోపణలు చేయడం సబబు కాదని, మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, సింగారెడ్డి సుధాకర్‌రెడ్డి, జల్లెల ఏడుకొండలు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, రామిశెట్టి సైదారావు, గుండాల చిన శ్రీను, పసుపులేటి బ్రహ్మనాయుడు, మునిగె వెంకన్న, కోటిరెడ్డి, వీరాంజనేయులు, గుండాల రంగనాయకులు, గన్నెబోయిన శ్రీను, కొండలు, గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

దుర్గి, మార్చి 3: మండలంలోని కోలగుట్ల గ్రామానికి చెందిన 30 యేళ్ల దాశరథి సుధాకర్ కనిపించడం లేదని అతని కుటుంబసభ్యులు ఆదివారం దుర్గి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సుధాకర్ మతిస్థిమితం లేని వ్యక్తి అని, శనివారం ఇంటి నుంచి వెళ్లిన అతను ఇప్పటి వరకు తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

వైసీపీని చిత్తుగా ఓడించాలి : బలిజేపల్లి

సత్తెనపల్లి, మార్చి 3 : మాదిగ జాతికి ద్రోహం చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను, వైసీపీని చిత్తుగా ఓడించాలని మాజీ కౌన్సిలర్, టీడీపీ నేత బలిజేపల్లి సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో కీలక దశలో ఉన్న సమయంలో ఆయా పార్టీలు తమ మద్దతు తెలియజేశాయన్నారు. చంద్రబాబు నాయుడు తమ మద్దతును తెలిపారన్నారు. వైఎస్ జగన్ మిన్నకుండి కనీసం సుప్రీం కోర్టులో న్యాయవాదిని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వ్యవహరించటంతో 22 వేల మంది మాదిగలు ఉద్యోగాలు పొందారన్నారు. మాదిగల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో కీలక దశలో ఉందని, ఎటువంటి తీర్పు వచ్చినా దానిని అమలు చేసేది రాష్ట్ర ప్రభుత్వాలేనన్నారు. ఎన్నికల సమయం కావున మాదిగలంతా ఐక్యంగా ఉండాలన్నారు.

మహిళను చంపిన వైసీపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలి

సత్తెనపల్లి, మార్చి 3 : రెంటచింతల మండలం మల్లవరంలో బిందెడు మంచి నీరు అడిగిన బాణావత్ సామినీబాయిని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని టీడీపీ నేతలు అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన మహిళను చంపటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేయాలన్నారు. గతంలో కూడా మాచర్ల నియోజకవర్గంలో బీసీ కులానికి చెందిన చంద్రయ్యను వైసీపీ గూండాలు దారుణంగా హత్య చేశారన్నారు. వైసీపీ నేతలు తమ పద్ధతులు మార్చుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నాయకులు పీలా సాంబశివరావు, పురుషోత్తం నాయక్, ప్రత్తిపాటి హరేకృష్ణ, జీ.చంద్రహాస్, ఎస్కే ఆదాం, ఎల్.రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న కన్నా

సత్తెనపల్లి, మార్చి 3 : పట్టణంలోని నాగన్నకుంటలో గల హెబ్సీబా గ్రాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని క్రైస్తవులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. చర్చి పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కన్నా వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

సత్తెనపల్లి, మార్చి 3 : కాకతీయ జనసేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ సహకారంతో ఆదివారం కాకతీయ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు నూతక్కి శ్రీనివాస్, నాగబండి రాజేష్, సంగ్రామ్‌సింగ్‌లు 120 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రావెల చంద్రశేఖర్, పచ్చ సుధీర్, దరువూరి నాగేశ్వరరావు, గుంటుపల్లి రోశయ్య, ఎలినేడి శ్రీనివాస్, గడ్డె మురహరిరావు, ఎం.అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలపాటి శ్రీధర్‌కు నియోజక వర్గ టిక్కెట్ కేటాయించాలి

అచ్చంపేట, మార్చి 3 : పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌కే కేటాయించాలని అచ్చంపేట మండల ముస్లిం మైనార్టీలు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. నియోజకవర్గాన్ని 18 సంవత్సరాలుగా కాపాడుతూ తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట గోడలా నిలిచిన కొమ్మాలపాటి శ్రీధర్‌కే కేటాయించాలన్నారు. నియోజకవర్గంలో 39 వేల మంది ముస్లింలు ఉన్నారని, వీరందరికీ కొమ్మాలపాటి శ్రీధర్ సుపరిచితుడేనని తెలిపారు. సమావేశంలో ఎస్కే కాసుల, పఠాన్ గాలీసా, ఎస్కే మాబూవలి, ఎస్కే తయ్యంబ్, యాకోవలి, అల్లా బాబు, ఆదం షఫీ, ముస్తఫా, షేక్ జాన్ సైదా, షేక్ బాల సైదా, ఇమామ్‌సా తదితరులు పాల్గొన్నారు.

నూర్జహాన్ మృతికి సంతాపం

సత్తెనపల్లి, మార్చి 3 : పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ నూర్జహాన్ ఆదివారం మరణించిన సమాచారం తెలుసుకున్న గుంటూరు నగర మాజీ మేయర్, టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తనయుడు కన్నా నాగరాజు ఆమె గృహానికి వెళ్ళి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

టీడీపీ అంటేనే బీసీలు : మద్దిరాల

పెదకూరపాడు, మార్చి 3 : టీడీపీ అంటేనే బీసీలని, బీసీలంటేనే టీడీపీ అనే పరిస్థితి రాష్ట్రంలో ఉందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచిన ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. ఆదరణతో పనిముట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఉపాధి కల్పించటంతో పాటు కార్పోరేషన్‌ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చింది టీడీపీ మాత్రమేనన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం ఇలా ఎన్నో రకాలుగా బీసీలకు అండగా నిలిచిన పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు.

'బ్రహ్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి'



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో టీడీపీ, జనసేన నేతలు

మాచర్ల రూరల్, మార్చి 3 : టీడీపీ, జనసేన ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నేతలు కోరారు. పట్టణంలోని 6వ వార్డులో ఆదివారం నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో వారు పాల్గొని మాట్లాడారు. బ్రహ్మారెడ్డి గెలుపుతోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటింటికి తిరిగి మేనిఫేస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్, మహిళా అధ్యక్షురాలు బండారు కృష్ణవేణి, డేగల కమలాకర్, చల్లా హరి, ఉప్పు లక్ష్మీనారాయణ, పల్లపు రాజు, డేగల యాకోబు, నాగేశ్వరరావు, వెంకటరామిరెడ్డి, బొల్లెద్దుల ప్రకాష్, షేక్ షైన, కొమ్ము సంతోష్, నట్టువ రవి, పేరుపోగు బాబురావు, దావీదు, గంగవరపు రవి, అన్నారావు, నల్లబోయిన బాలశౌరి, మంజుల వెంకటేశ్వర్లు, అంజి, కొమెర శివ, గురుప్రసాద్, చల్లా రాజారత్నం, రమేష్, బాబు, దానం, దాసు పాల్గొన్నారు.

మండలంలో అధిక సంఖ్యలో జ్వరపీడితులు : సీపీఎం

క్రోసూరు, మార్చి 3 : క్రోసూరు మండలంలోని పలు గ్రామాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారని సీపీఎం నాయకుల బృందం ఆదివారం తెలిపింది. ఆయా గ్రామాల్లో తాము పర్యటించినట్టు వారు తెలిపారు. గుడిపాడు, గరికపాడు, గాదెవారిపాలెం, ఆవులవారిపాలెం గ్రామాల్లో సుమారు రెండు వందల కుటుంబాల్లో జ్వర పీడితులు ఉన్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులుగాని జ్వర పీడితులను పట్టించు కోవటం లేదన్నారు. సీపీఎం నాయకుల బృందంలో పార్టీ మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, గుదె శేషగిరి, భాస్కర్‌రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి టీడీపీ నేతలు ఆర్థికసాయం

విజయపురిసౌత్, మార్చి 3: మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి నారాయణ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ, జనసేన నేతలు ఆదివారం నారాయణ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి రామిశెట్టి సైదారావు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, జూకూరి సత్యం, కాటం పిచ్చయ్య, కొండా హుస్సేన్, హనుమంతురావు, నారాయణ, గాలెయ్య, గోపిరాజు, బాలు, రవి, నాగరాజు, జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ప్రారంభించిన ఎమ్మెల్యే పీఆర్కే

విజయపురిసౌత్, మార్చి 3: మాచర్ల మండలం తాళ్లపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును శనివారం రాత్రి ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం టీడీపీకి చెందిన పున్నా బ్రహ్మం, బొజ్జ కల్పన, కరంటోత్ శ్రీనునాయక్‌లు ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పీఆర్కే సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బూడిద శ్రీనివాస్ యాదవ్, యంగ్ర గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పార్టీ మారటం ఆయన ఇష్టం : కాసు

పిడుగురాళ్ల, మార్చి 3: నరసరావుపేట ఎంపీగా వున్న శ్రీకృష్ణదేవరాయలు పార్టీ మారటం ఆయన ఇష్టం. అంతే తప్ప చేయని అభివృద్ధి, తీసుకురాని నిధులను నేనే తెచ్చానని చెప్పటం సరికాదని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలునుద్దేశించి వ్యాఖ్యానించారు. ఆదివారం పిడుగురాళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ, మెడికల్ కళాశాల మంజూరులో, జలజీవన్ మిషన్ నిధులు విడుదలలో అందరి నేతల కృషి వున్నదని చెప్పారు. వరికపూడిశెల, గురజాల హైవే మార్గం పనులకు శ్రీకృష్ణదేవరాయలు కొంత సహకారం అందించి వుండవచ్చన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, అల్లు పిచ్చిరెడ్డి, కొమెర వెంకటేశ్వర్లు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

బంగారు తల్లిపై అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్

నరసరావుపేట లీగల్, మార్చి 3: బంగారు తల్లి కార్యక్రమంపై పిల్లల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు. ఆదివారం ఉదయం పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో విద్యా శాఖ ఆధ్వర్యంలో డీఎల్‌డీవో, మండల విద్యాశాఖ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తల్లి ప్రోగ్రెస్ కార్డుల్లో వివరాలు ఎప్పటికప్పుడు పూర్తిగా బ్లడ్ గ్రూపుతో సహా నమోదు చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులు రక్తహీనత ఉన్న పిల్లల తల్లులతో ప్రత్యేకంగా సమావేశమై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు, సాంకేతిక విజ్ఞానం ఎంతో కీలకమైనవి

ఎస్పీ రవి శంకర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, మార్చి 3: క్రీడలు సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైనవని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకరరెడ్డి శనివారం పేర్కొన్నారు. మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి జాతీయ స్థాయి విద్యార్థి క్రీడా, సాంకేతిక దినోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫిట్‌గా ఉండేందుకు రోజు వ్యాయామాలు చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతి ప్రదానం చేశారు.



చాకలికుంట తండాలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

చాకలికుంట తండాలో రూ.3.50 కోట్ల అభివృద్ధి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, మార్చి 3: మండలంలోని చాకలికుంట తండాలో రూ.3.50 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 30 మందికి ఆర్‌వోఆర్‌ఎఫ్‌ఆర్ పట్టాలను, 389 మందికి స్వమిత పట్టాలను, 83 మందికి ఇంటి పట్టాలను, 99 మందికి వైఎస్‌ఆర్ పింఛన్లను పంపిణీ చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.55లక్షల వ్యయంతో తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, నియోజక వర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, సత్తెనపల్లి నియోజక వర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, కోడూరి వెంకటేశ్వర రెడ్డి, బికారీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో ప్రబలుతున్న డెంగీ జ్వరాలు

రొంపిచర్ల, మార్చి 3: మండలంలోని రెడ్డిపాలెంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నా, సర్వేలు నిర్వహిస్తున్నా ఎటువంటి ఫలితాలు ఉండటం లేదని విమర్శలు వినవస్తున్నాయి. ఇద్దరు వైద్యాధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో జ్వరాల బారిన పడి పలువురు మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి జ్వరాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసరావుపేట కల్చరల్, మార్చి 3 పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం అర్వపల్లి పాండురంగారావు, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరపున విజేత ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన కన్పించింది. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన వైద్యశిబిరం మధ్యాహ్నం 2గంటల వరకు సాగింది. ఈ శిబిరానికి 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 160మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. అనంతరం ఈరోజు 40మందిని శస్త్ర చికిత్స కోసం శంకర ఆసుపత్రికి తరలించారు. మిగతా వారిని దఫాల వారీగా పంపించి శస్త్ర చికిత్స చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కాగా శిబిరాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు కొత్తూరి సుబ్బారావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు అర్వపల్లి నరసింహారావు, పుణ్యవతి, ప్రసన్నాంజనేయులు, రాధాకృష్ణ, పద్మ, అఖిలేష్, ప్రియాంక, సైలేష్, రాజేష్, శిరీషలు నిర్వహించగా, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు సహకరించారు. వైద్యశిబిరంలో శంకర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాపై నిందలు సరికాదు: బొల్లా

వినుకొండ టౌన్, మార్చి 3: వినుకొండలో నన్ను ఎదుర్కోలేకనే జీవీ స్క్రిప్ట్ ఇచ్చి చంద్రబాబుతో నాపై నిందలు వేయించారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనదైన శైలిలో విమర్శల వర్షం కురిపించారు. దాచేపల్లి బహిరంగసభలో తనపై చేసిన విమర్శలకు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాలు మానుకుంటానని, నా ఇంటి పేరులోనే నిజాయితీ ఉందన్నారు. గతంలో మక్కెన అనుచరుడిని చెప్పుతో కొడతానన్నది వాస్తవమని, రైతును కాదని వివరణ ఇచ్చారు. సీఎం జగన్ అన్ని ప్రయత్నాలు చేస్తే వరికపూడిశెల ప్రాజెక్టుకు పర్మిషన్లు వచ్చాయి తప్ప ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఒక్కడి వల్ల కాదని అన్నారు. ఆయనతో పాటు వైసీపీ సీనియర్‌నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, స్వెనోమ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా గిరి ప్రదక్షిణ

వినుకొండ, మార్చి 3: మహాశివరాత్రిని పండుగను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గిరి ప్రదక్షిణ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. మార్చి 8వ తేదీన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని వినుకొండ రామలింగేశ్వరస్వామికొండ చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా కొండ మెట్ల వద్ద ఉన్న వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం నుంచి ప్రారంభమయ్యే బైక్‌ర్యాలీ శిశుమందిర్ మీదుగా నాగులపుట్ట, కొండ వెనుక మీదుగా వేణుగోపాల స్వామి గుడి, ఆర్టీసీ బస్టాండ్ తిరిగి కొండమెట్ల వద్ద గల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చేరుకుంటుంది. కార్యక్రమంలో జి.నాగపవన్‌కుమార్, కె.సుబ్బారావు, కె.భద్రయ్య, గంటారావు, బాలారావు, బి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

5న జరిగే జయహో బీసీ సభను జయప్రదం చేయండి

● టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి అరవిందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 3: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 5న నిర్వహించే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించే సభకు రెండు లక్షలమంది హాజరు అవుతారని అంచనా వేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీలపై 3వేల కేసులు నమోదు చేశారని, 200 మందిని హత్య చేశారని, ఒక్క పల్నాడు జిల్లాలోనే 27మందిని హత్యచేశారన్నారు. టీడీపీ జనసేన ఉమ్మడిగా నిర్వహించే జయహో బీసీ బహిరంగ సభకు చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్న పాత్రుడు హాజరవుతారన్నారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో జరిగిన రా... కదలిరా బహిరంగ సభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వేలాదిగా హాజరై జయప్రదం చేశారన్నారు. రెండు రోజులలోనే కార్యక్రమాన్ని చక్కగా ఏర్పాటుచేసిన యరపతినేని శ్రీనివాసరావుకు, ధన్యవాదాలు తెలియజేశారు. సీనియర్ నాయకుడు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు అందరూ హాజరై సభను విజయవంత చేశారన్నారు. కష్టపడి పనిచేసే వారికే సీటు ఇస్తామని నారా చంద్రబాబునాయుడు చెప్పారని అన్నారు. 5వ తేదీన జరిగే జయహో బీసీ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ సీటు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ ఆశీస్సులతో గెలవబోతున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, కొక్కిరాల గంగాధర్, కొలిపాక చంద్రశేఖర్, కొలికొండ కొండలు, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, చింతిరాల బాలు, కొల్లి వెంకటేశ్వర్లు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జీవీ ఆత్మీయ సమ్మేళనం

● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలి
● నవ్యాంధ్ర భవిష్యత్‌కోసం పనిచేయాలి
● వినుకొండ పరిసర ప్రాంతాల ప్రజలతో జీవీ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జీవీ

వినుకొండ, మార్చి 3: జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే వినుకొండ నియోజకవర్గానికి చెందిన ప్రజలు తమ కుటుంబసభ్యులతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జీవీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీ కృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుకు అభినందనలు తెలిపారు. ఆంధ్ర ప్రజల భవిష్యత్ కోసం నారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం తథ్యమని, సైకో పాలన పోవాలంటే ప్రతి ఒక్కరూ పది ఓట్లు వేయించేలా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. 25వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామని అహంకారంతో బొల్లా మాట్లాడుతున్నారని, నా మంచితనం ఇప్పటివరకు ఒక వైపునే చూశారని, నన్ను మరోవైపు చూడవద్దని బొల్లాను ఉద్దేశించి ఘాటుగా విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు తన గెలుపునకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని, బొల్లా మీసాలు తీసే రోజులు దగ్గర పడ్డాయని, గత రికార్డును బద్దలు కొడతామని, కొత్త రికార్డుకు సంసిద్ధమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించి పార్టీ రుణం తీర్చుకునే అవకాశం కల్పించాలని కోరారు. నాకోసం పనిచేసే ప్రతికార్యకర్తకు అండగా ఉంటానని, అందరికి న్యాయం చేస్తామని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రతి ఒక్కరూ నియోజకవర్గంలో పనిచేసేందుకు వివరాలందించాలని కోరారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు, టీడీపీ అధికార ప్రతినిధి జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువత చైతన్యంతో ఓటెయ్యాలి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తదితరులు, కళారూపం ప్రదర్శిస్తున్న ప్రజా సాంస్కృతిక వేదిక కళాబృందం

నరసరావుపేట టౌన్, మార్చి 3: రాబోయే ఎన్నికలలో 50శాతం ఓటింగ్ గలిగిన యువత చైతన్యంతో ఓటే ఆయుధంగా ఉద్యమించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. ఆదివారం నరసరావుపేటలోని పేరడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ అధికారులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారి అనేక లోపాలకు శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లను ఎన్నికలలో తమ సైన్యంగా, పోలింగ్ ఏజెంట్‌లుగా సాక్షాత్తు ముఖ్యమంత్రి, మంత్రులు బహిరంగంగా ప్రకటించడాన్ని ఖండించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించినా అధికారపార్టీ నేతలు ధిక్కార స్వరాన్ని వినిపించటం దేశ చరిత్రలో ఎప్పుడు జరగలేదని అన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాతల కూడా నామినేషన్ వేసే వరకు అర్హులైన వారు ఓటర్లుగా నమోదు కావచ్చునని చెప్పారు. రాజకీయనేతలు డబ్బులు, మద్యం, కుల మతాలు రెచ్చగొట్టి ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని, తద్వారా ప్రజాస్వామ్యం, ధనస్వామ్యంగా మారుతుందన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక, మద్యం, మట్టి, గనులు, మైనింగ్ అధికారపార్టీ నేతలు చేస్తూ పవిత్రమైన రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. అధికార యంత్రాంగంపై పట్టు సాధించి రాజకీయ అవినీతిని పెంచి పోషిస్తున్నారని అన్నారు. లోక్‌సత్తా ఉద్యమ నేత మాకినేని హరిబాబు మాట్లాడుతూ ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అవినీతిపరులైన రాజకీయ నేతలను ప్రజలు తిరస్కరించాలని అన్నారు. రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాజేష్ నేతృత్వంలోని కళాబృందం ఆట, పాటలతో కళారూపాలతో ఆకట్టుకున్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి బొల్లాకు లేదు: జీవీ

వినుకొండ టౌన్, మార్చి 3: అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా.... రాజకీయ చాణిక్యుడుగా ప్రజాపాలన అందించే మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుపై స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదివారం తన పార్టీ కార్యాలయంలో చేసిన విమర్శలను, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పాలశాతాలతో పేద ప్రజలను బురిడీ కొట్టించి రైతులను మోసం చేసి వందల కోట్లు దోచుకున్న నీవు చంద్రబాబుతో పాటు ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించడమేన్నారు. బ్రహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో 175 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించావు, పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీలో ప్రభుత్వ భూమి ఉందని, ప్రభుత్వ భూమిని, ప్రభుత్వానికి అమ్మివేల కోట్లు దోచుకోలేదా అని విమర్శించారు. తెల్లబాడులో వైశ్యుల భూమితో పాటు, ముస్లింల భూమిని ఆక్రమించుకున్న మాట వాస్తవం కాదా అన్నారు.

కృష్ణాపురంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కృష్ణాపురం (శావల్యాపురం) మార్చి 3: త్రైతసిద్దాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక వారి ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాపురం గ్రామంలో కమిటీ సభ్యులు ఆదివారం ప్రచారాన్ని నిర్వహించారు. ఆచార్య త్రైతసిద్దాంత భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాతి ధ్వజస్తంభానికి రూ.2.50 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, మార్చి 3: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పొంగళ్ల వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన రుద్రబొట్ల ప్రవీన్, ప్రశాంతి దంపతులు ఆలయంలో రాతి స్తంభం నిర్మాణం కోసం రూ.2.5 లక్షల విలువైన చెక్కును అలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహంకాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు రుద్రబొట్ల ప్రవీన్, ప్రశాంతి దంపతులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి దాతలకు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌కొత్త సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు కాకుమాను వెంకట బదరీనారాయణ, బూసా సుబ్రమణ్యేశ్వర రావు, నంద్యాల మాధవీదేవి, ఆలపాటి ప్రసాదరావు, దరువూరి రజని, అట్లూరి శ్రీనివాసరావు, అల్లంశెట్టి అలివేలమ్మ, మేడా అలివేలు, నందూరి కాళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు

వినుకొండటౌన్, మార్చి 3: మండల పరిధిలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వం మద్యం షాపు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళలను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే నడిగడ్డ గ్రామానికి చెందిన దాసరి లత, ఆటో డ్రైవర్ చెన్నమశెట్టి శ్రీనివాసరావు కలిసి అక్రమంగా మద్యం దుకాణం నుంచి 169 మద్యం సీసాలను ఆటోలో తరలిస్తుండగా ఎస్ఈబీ ఎస్ఐ నగేష్ సిబ్బందితో కలిసి రూ.28 వేలరూపాలు విలువైనమద్యం సీసాలను అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు విషయం వెలుగులోకి రావడంతో, షాపులోని సేల్స్ మేన్ ఆళ్ళ వెంకిరెడ్డి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు.



సహస్ర చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా సహస్ర చండీ హోమం

నరసరావుపేట రూరల్, మార్చి 3: మండలంలోని కోటప్పకొండలో ఘనంగా సహస్ర చండీ పారాయణ, సహస్ర చండీహోమం ఘనంగా నిర్వహించారు. కోటప్పకొండ వద్ద ఉన్న వేమలమ్మతల్లి బ్రిక్స్ దగ్గర కామాఖ్యామృత శోధన వారి ఆధ్వర్యంలో ఆదివారం సహస్ర చండీ పారాయణ, సహస్ర చండీ హోమం నిర్వహించారు. 108 హోమ కుండములతో 1008 మంది భక్తులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు. శ్రీ రామమూర్తి, ఎన్. వెంకటేశ్వర్లు (నాదెండ్ల), ఎమ్.వేముల క్రిష్ణ ఎమ్.చెన్నారెడ్డి, ఎస్.సాంబయ్య సాయి తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా వినాయకస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్, మార్చి 3: నరసరావుపేట పట్టణంలో రెడ్డి నగర్‌లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి, అనిల్ కుమార్ యాదవ్ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు ఆశీర్వాదం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీపీ, జడ్పీటీసీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తెలిపే చక్రం నమూనాను పరిశీలిస్తున్న అమెరికాకు చెందిన ఫ్యాషన్ క్రాప్ సీఈవో జారోఫ్ తదితరులు

ప్రకృతి వ్యవసాయ విధాన సాగు పంటల పరిశీలన

కొత్తపాలెం (యడ్లపాడు), మార్చి 3: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నట్లు అమెరికాకు చెందిన ఫ్యాషన్ క్రాప్ సంస్థ సీఈవో మెర్సీజారోస్ అన్నారు. ఆర్‌వైఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ బాజిడియో, నెల్లూరుజిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంజనసింహ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకు మారిలతో కలసి మెర్సీజారోస్ మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం పర్యటించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పత్తి, కూరగాయలు, పూలతోటలను పరిశీలించారు. సాగు చేస్తున్న విధానం, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం లోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తెలుపుతూ ముగ్గులతో వేసిన చక్రం నమూనాను పరిశీలించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేమయ్యారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ మార్కెటింగ్ ప్రతినిధి ప్రభాకర్, రైతు ఉత్పత్తిదారుల ట్రస్ట్ ప్రతినిధి స్మిత, ఆర్‌వైఎస్ఎస్ స్టేట్ రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకట్రావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

నరసరావుపేట లీగల్, మార్చి 3: నియోజకవర్గంలో పల్స్‌పోలియో విజయవంతం అయ్యింది. పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న ఏరియా ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదివారం ఉదయం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేసి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నాదెండ్లలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

● **నాదెండ్ల:** మండలంలోని నాదెండ్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో 18 కేంద్రాల పరిధిలో 3,402మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 3,179మందికి, గణపవరం ఆరోగ్య కేంద్రం పరిధిలో 11కేంద్రాల్లో 2,775 మందికి గాను 2,691 మందికి పోలియో చుక్కలు వేశారు. కాగా నాదెండ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జడ్పీటీసీ కే.మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, వైద్యులు సాయి శ్వేత, జ్ఞానేశ్వరి, గణపవరంలో వైద్యులు ఎల్.ప్రసాదు నాయక్, కవిత అనసూర్యలు పాల్గొన్నారు.

● **రొంపిచర్ల:** మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో చుక్కలను ఆదివారం పంపిణీ చేశారు. సోమవారం ఇంటింట సర్వే నిర్వహించి మిగిలిన వారికి పోలియో చుక్కలు పంపిణీ చేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

● **నరసరావుపేట రూరల్:** మండలంలోని కోటప్పకొండ ప్రభుత్వ వైద్యశాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో చుక్కలు 98% పూర్తయినట్లు వైద్యాధికారి మమతప్రియ తెలిపారు. లింగంగుంట్లలో పల్స్ పోలియోను నరసరావుపేట మండల ఈవోపీఆర్డీ కేవీఎస్ ప్రసాద్ ప్రారంభించారు. పోలియో చుక్కలు వేయించుకోని వారు ఆశావర్కర్లు, వైద్యశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

● **యడ్లపాడు:** మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గణాంక అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రభాకరరావు మాట్లాడుతూ మండలంలో 0-5 ఏళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారులు 4,501మంది ఉండగా, తొలిరోజు 97శాతం 4,352 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

● చిలకలూరిపేట: రోటరీ క్లబ్ వారు స్థానిక కళా మందిర్ సెంటర్‌లో మునిసిపల్ ఆరోగ్య సిబ్బందితో కలసి ఆదివారం పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో క్లబ్ పోలియో డైరెక్టర్ ఎన్ చంద్రశేఖరరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాపు వెంకటరావు, ఏ వేమనరెడ్డి, క్లబ్ డైరెక్టర్ ఉప్పుటూరి ప్రసాదు, డాక్టర్ లావు అరుణ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుదిగని అసమ్మతి నేతలు

● ఎమ్మెల్యే వ్యతిరేకులతో ఎమ్మెల్సీ మర్రి చర్చలు విఫలం

నరసరావుపేట, మార్చి3: నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలతో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆదివారం రాత్రి జరిపిన చర్చలు విఫలమైనట్టు సదరు నేతలు తెలిపారు. పార్టీ సీనియర్ నేత డాక్టర్ గజ్జల బ్రహ్మరెడ్డి వర్గం ఎమ్మెల్యే గోపిరెడ్డికి వ్యతిరేకంగా పని చేస్తోంది. ఇది అయనకు తలనొప్పిగా పరిణమించింది. ఈ నేపథ్యంలో డాక్టర్ గజ్జల వెళ్లి ఎమ్మెల్సీ మర్రితో రాజీచర్చలు జరిపారు. ఎమ్మెల్యే కూడా చర్చల్లో పాల్గొన్నట్టు చెబుతున్నారు. మర్రి చర్చించినా అసమ్మతి నాయకులు మెట్టు దిగలేదు. ఎమ్మెల్యేతో కలసి పనిచేయలేమని వారు తేల్చి చెప్పినట్టు నేతలు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని తాను పరిష్కారిస్తానని మర్రి చెప్పినా వారు సానుకులత తెలపలేదని తెలిసింది. పార్టీ అధిష్టానం వద్దే తేల్చుకుంటామని గజ్జల స్పష్టం చేసినట్టు అయన వర్గీయులు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 3: శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ ఆదివారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. చిలకలూరిపేట మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన గౌతం రామ్‌సాయి పాము కాటుకు గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.70వేలు చెక్కును, గోవిందపురం గ్రామానికి చెందిన నీరుకొండ నాగరాజ కుమారికి రూ.80వేల చెక్కును పంపిణీ చేశారు. యడ్లపాడు మండలం తిమ్మాపురంనకు చెందిన నాగండ్ల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.1.70 లక్షలు పంపిణీ చేశారు.

టెన్నిస్ పోటీల్లో చిలకలూరిపేట క్రీడాకారుల ప్రతిభ

చిలకలూరిపేట, మార్చి 3: నరసరావుపేటలో ఆదివారం రాత్రి ముగిసిన నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. మెన్స్ 45 సంవత్సరాల లోపు విభాగంలో డాక్టర్ మక్కెన వంశీ, కంఠమనేని వంశీ జట్టు రన్నర్స్‌గా విజయం సాధించాయి. 65 సంవత్సరాల పైబడిన మెన్స్ విభాగంలో సింగరయ్య, మనోహర రెడ్డి జట్టు విన్నర్స్‌గా గెలుపొందాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను స్థానిక సీఆర్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు అభినందించారు.

రోడ్డు ఆక్రమణలపై పోలీసుల హెచ్చరిక

చిలకలూరిపేట, మార్చి 3: నిర్దేశించిన పరిధిని దాటి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని అర్బన్ సీఐ ఆదివారం రాత్రి హెచ్చరించారు. పట్టణంలోని నరసరావుపేట సెంటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అడ్డంకిగా ఉన్న ఆక్రమణదారులకు ఆయన అవగాహన కల్పించారు. ఆక్రమణలను తక్షణం తొలగించాలని కోరారు. పట్టణంలో ఆటోల పార్కింగ్ కూడా నిర్దేశించిన ప్రదేశాల్లోనే జరపాలని ఆయన సూచించారు. సర్వీస్ రోడ్లలో ఆక్రమణలను ఎవరికి వారే తక్షణం స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. భారీ వాహనాలు రద్దీవేళల్లో పట్టణంలోకి లోడింగ్, అన్‌లోడింగ్‌కు రాకుండా చూడాలని ఆయన వ్యాపారులను కోరారు. సీఐ రమేష్‌తో పాటు ఎస్ఐ పుల్లారావు, పోలీసు సిబ్బంది పట్టణంలో పర్యటించారు.



నాదెండ్ల బొట్టు గుంట చెరువులో జరిగిన తవ్వకాలు

అక్రమంగా అధికార పార్టీ నేతల గ్రావెల్ తవ్వకాలు

నాదెండ్ల, మార్చి 3: మండలంలోని నాదెండ్ల గ్రామంలో అధికార పార్టీ నేతలు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని బొట్టుగుంట చెరువులో రాత్రివేళల్లో ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా లోతుగా ఈ చెరువులో గ్రావెల్ తవ్వకాలు చేయటం వల్ల భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే ప్రమాదం నెలకొంది. గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకులు రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వచ్చిన అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా వారు కూడా స్పందించటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం

వినుకొండ టౌన్, మార్చి 3: జీఎంసీలో ఎంబీబీఎస్ చదువుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కనుగుల పూజితకు శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో హాస్టల్ నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.7వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం హిమాలయ గురువు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పూజితకు ప్రతి నెలా హాస్టల్‌కు అవసరయ్యే ఖర్చుల నిమిత్తం రూ.42వేలు ఇప్పటికే చెల్లించామని, ఆశ్రమం ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఆశ్రమం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కనెగండ్ల అనంత కోటేశ్వరరావు, సువర్చలాదేవి ఆర్థికసాయాన్ని ఆయన చేతులమీదుగా అందజేశారు.

8న దేవాలయాలలో కోడెదూడల వేలంపాట

కారుమంచి (శావల్యాపురం) మార్చి 3: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కారుమంచిలోని శ్రీసీతారామస్వామి, నీలంపాటి అమ్మవారి దేవాలయాలలో కోడెదూడల వేలంను ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు ఆదేరోజు సాయంత్రం 3గంటలకల్లా రూ.100 డిపాజిట్ చెల్లించి పేరును నమోదు చేయించుకోవాలని, పూర్తివివరాలకు 9705445156, 913305706లో సంప్రదించాలన్నారు.